

చైతన్యం
మే 2020
రు. 20/-
సంకల్ప బలం
సామాజిక విలువల మాసపత్రిక
విశాఖపట్నంలో
విష వాయువు లీక్
LG Chem
LG Polymers India


Only leave home to shop for necessities
Work from home and do not travel
Do not meet others - even friends or family





# చైతన్యం

సంకల్ప బలం


సామాజిక విలువల మాస పత్రిక

వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి

సంపుటి -9 మే 2020 సంచిక - 8


## ఈ సంచికలో


| | | | |
|---|---|---|---|
| సంపాదకీయం | 4 | కరోనా విషాణువు-19 | 27 |
| అభిప్రాయ వేదిక | 5 | ప్రేమంటే ఇంతే | 30 |
| కరోనా కవితలు | 6 | గడిలో దాగిన వైజ్ఞానిక నుడి | 34 |
| కరోనా నుండి విముక్తి పొందాలని .... | 7 | తెలుగు పద్య రత్నాలు | 36 |
| పూరి జగన్నాధస్వామి వైభవం | 8 | తరువు తపన | 38 |
| సప్త మోక్ష నగరాలు | 12 | హాస్యానికి రాజు - బసవరాజు | 39 |
| ఎదురు చూపు | 17 | మా ఊరి నందుల కథ | 42 |
| కరోనాపై వీడియో కథ | 19 | మాదిరాజు రంగారావు | 44 |
| శ్రీసూక్తం | 20 | స్వయంవరం | 46 |
| తొమ్మిదవ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ | 23 | ప్రహేళిక | 50 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## గోరుచుట్టు మీద రోకలిపోటు    కరోనా వైరస్ ---- స్టైరిన్ కెమికల్స్

ఒక పక్క 'కరోనా వైరస్' తో ప్రజలంతా నానా ఇబ్బందులూ పడుతూ లాక్ డౌన్ వల్ల ఇళ్లల్లోనే ఉంటూ వారి జీవితాల్ని జాగ్రత్తగా గడుపుకుంటున్న సమయంలోనే 'గోరుచుట్టు మీద రోకలి పోటులా' వైజాగ్ నగరంలోని వెంకటాపురంలో మే నెల తెల్లవారితే 7వ తేదీ అనగా తెల్లవారుఝామున గం 3. 15 ని లకు అందరూ మంచి నిద్రలో ఉండగా ఎల్జీ పాలిమర్స్ నుండి ఒక్క సారి "స్టైరిన్ కెమికల్" అనే విష వాయువు వ్యాపించడంతో నిద్రలోనే కొందరు ఆ వాయువుని పీల్చడం, మరి కొందరికి అర్ధంకాక, ఆ వాసన పీల్చలేక రోడ్లమీద పరుగు అందుకున్నారు. ఇంకా కొందరైతే పరుగులు పెట్టలేక రోడ్డు మీదే పడిపోయారు. ముఖ్యంగా ఇది వైజాగ్ లోని వెంకటాపురం, చుట్టుపక్కల 5 గ్రామాల ప్రజల వరకూ ఇటువంటి ఇబ్బందులు పడ్డారు. ప్రజలే కాక పశువులు, వృక్షాలు, సహా అన్నీ ఆ విష వాయువు వలలో చిక్కుకున్నాయి. హాస్పటల్ వాళ్ళు, పోలీసులు ప్రజలకు ఎంత సహకారం అందించినా 12 మంది వరకు మృత్యువాత పడక తప్పలేదు. ఇంకా చాలామంది అనేక ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రి పాలయ్యారు. ఇంకా ఆ చుట్టుపక్కల ప్రజలు రెండు రోజులు, దూరంలో ఉన్న తమ బంధువుల ఇళ్లకు వెళ్లి వచ్చినా, ఇక భయం లేదు అని ప్రభుత్వం చెప్పినా వారు భయ భ్రాంతులవుతూనే ఉంటున్నారు- ఎప్పుడు ఏమి వస్తుందా! అని. అలాగే ప్రభుత్వ అధికారులు వచ్చి ఎన్ని హామీలు ఇచ్చినా ఒక పక్క తమ వారిని కోల్పోయినవారు, మరో పక్కఆరోగ్య సమస్యలతో ప్రజలు, వారి ఆవేదన వర్ణనాతీతం. ఎవరు ఎంతిచ్చి వారి బాధలను తీర్చగలరు? ఇది ఎప్పటికీ మిలియన్ డాలర్ల ప్రశ్నే .

ఆ "ఎల్జీ పాలిమర్స్" కంపెనీయే అక్కడ ఉండడానికి వీలు లేదు అని ప్రజలు ఆందోళన చేస్తున్నారు. అసలు ఆ కంపెనీ అక్కడ ఉన్నప్పుడు ఎన్ని ఇళ్ళు ఉన్నాయి? చుట్టూ ఇళ్ళు ఉంటే మధ్యలో కంపెనీ పెట్టారా? అక్కడ ఆ కంపెనీ ఇన్ని రోజులనుండి ఉంటే, అక్కడ కంపనీ ఇన్స్పెక్షన్ జరిగితే, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఏమి చేస్తున్నాయి? దాని వల్ల ప్రమాదాలు జరిగినా ఫరవాలేదని ప్రభుత్వం వదిలేసిందా? ప్రజలు ఆ కాస్సేపు గొడవ చేస్తారు, ఎంతో కొంత డబ్బు ఇస్తే చాలను కున్నారా? లేదా కంపెనీ చుట్టూ ప్రజలే ఇళ్ల కట్టుకున్నారా? అలాంటి ప్లేసులో ఇల్లు కట్టు కోవడానికి ప్రభుత్వం పర్మిషను ఉందా? అనే విషయాలు కూడా చాలా ఓపెన్ గా తేల వలసి ఉంది. ఎందుకంటే మన దేశం లో చాలా చోట్ల ఇటువంటివి కట్టడాలు జరగడం, నష్ట పోవడం, ఆ కాస్సేపు చేతులు కాలాక ఆకులు పట్టు కోవడం దులిపేసుకోవడం చూస్తూనే ఉంటాము. వీటి గురించి ప్రభుత్వం చాలా నిక్కచ్చిగా నిస్పక్షపాతంగా నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా పెద్ద పెద్ద ఫ్యాక్టరీల్లో కూడా చవకబారు మెషీన్లు వాడి, ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటూ ఉంటారు. వాళ్ళు ఏదైనా గొడవ చేసి రోడ్డెక్కితే, వారికీ డబ్బు ఎర చూపించి వాళ్ళ నోళ్లు మూయిస్తారు. ఇటువంటివన్నీ మన దేశంలో జరుగుతున్న అత్యంత బాధాకర విషయాలు. ప్రభుత్వం పైకి అంటే ప్రజల మధ్య మాటల్లో చెపుతున్నట్టుగా కాక, ప్రజల ప్రాణాలకు చేతల్లో ఇంకా విలువ ఇవ్వవలసిన అవసరం ఎంతయినా ఉంది.

ఇక "కరోనా" విషయానికి వస్తే ఇంకా తన ప్రతాపాన్ని చూపిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను ఇబ్బంది పెడుతూనే ఉంది. భౌతిక దూరం పాటిస్తూ లాక్ డౌన్ లలో కొంత వరకూ ప్రభుత్వం సడలింపులు ఇచ్చింది. అందులో భాగంగా మందు షాపులు తెరవడంతో ఇక మందు బాబులు దుకాణాల ముందు ప్రభుత్వం ఎంత రేటు పెంచినా కూడా పెద్ద క్యూ కట్టారు. ఇన్నాళ్లు సుఖంగా ఉన్నాం. ఇప్పుడు ఎందుకు తెరిచి మా సంసారాల్లో నిప్పులు పోస్తారు అంటూ కొందరు స్త్రీలు రోడ్డెక్కినా కూడా వారి మాట ఎవరూ లెక్క చెయ్య లేదు. అసలే ఈ "కరోనా" తో ఆర్ధిక పరిస్థితి అంతంత మాత్రముగా ఉంటే, అకాలవర్షాలు పడి, పంటలు నాశన మవుతూ, ప్రజలు ఇంకా ఇబ్బందుల పాలవుతున్నారు. మరో పక్క వలస దారులు నానా ఇబ్బందీ పడుతున్నారు. ప్రభుత్వం అంతా చేస్తానంటుంది కానీ మాకు తిండీ ఏమీలేక నానా ఇబ్బందులు పడుతున్నాము అంటూ వారు వారిపిల్లలను చంకలలో సామాన్లు నెత్తి మీద పెట్టుకుని ఎండలో చెప్పులు కుడా లేక కొన్ని కిలోమీటర్ల దూరం నడిచి వెడుతున్నారు. ఎవరో కొందరు పుణ్యాత్ములు కొందరి సంగతి చూస్తున్నారు కానీ ఎంతైనా ఇబ్బందులపాలవుతున్నారు. ఎట్ట కేలకు ప్రభుత్వం ప్రత్యేక రైళ్లు వేసి వారిని వారి ప్రాంతాలకు జేరుస్తోంది. అలాగే విదేశాలలో ఉన్న మన వారిని కూడా ప్రత్యేక విమానాలలో ఇండియా తీసుకువస్తోంది. ఈ విధంగా ప్రపంచంతో పాటు మన దేశం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. కానీ మన దేశం జనాభా ఎక్కువైనా వీలైనంత వరకూ మేము ప్రజలు ఇబ్బంది పడకుండా చూస్తున్నాం అంటోంది ప్రభుత్వం. ప్రపంచాన్ని కరోనా పట్టి పీడిస్తున్నా, మీడియా తమకేమవుతుందో అని కూడా లెక్క చెయ్యకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు వార్తలను అందిస్తుంటేనే, ప్రజలంతా నిశ్చింతగా ఉంటున్నారు. అటువంటి మీడియాను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. అంతే కానీ బురద చల్లవద్దు అని మనవి. పన్నుల రూపంలో మనం కట్టిన డబ్బులతో స్కూల్స్, కాలేజెస్ కడితే, అందులో చదువుకుని, తల్లి తండ్రులు కష్టపడి చదివిస్తే చదువుకుని విదేశాలకు వెళ్లిన వారు తమంతట తామే తమ బాధ్యతగా తల్లి తండ్రులకే కాక, మన దేశానికి కూడా ఆర్ధిక సహాయం చెయ్యడం తమ కనీస బాధ్యతగా భావించాలి. అంతే కానీ మా దేశాన్ని మీడియా తక్కువ చేస్తుందా అని, తాము ఉన్న దేశాన్ని తక్కువ చేశారని మీడియా మీద దేశం మీదా, దేశ ఆర్ధిక వ్యవస్థ మీద విరుచుకు పడడం ఎలా ఉందంటే మీరు మమ్మల్ని కన్నారు కదా!, అలాగే ఆ దేశంలో పుట్టాం కదా! మా బాధ్యత మీది కాబట్టి మీరు మా బాధ్యత వహించారు. అంత మాత్రానికే మమ్మల్ని ఎందుకు అడుక్కుంటారు? అన్నట్టుగా ఉంది విదేశాలలో ఉన్న మన వారి ప్రవర్తన ఇది మన దేశ సంస్కృతికే అవమానకరం.

మనం ఎక్కడ ఉన్నా మన తల్లి మన తల్లే, మన దేశం మన దేశమే. మన గుండెలనిండా ప్రేమ నింపే మన తల్లీ, మన దేశం మనదేశం స్థితి గతులు ఎప్పటికప్పుడు గమనించి, విదేశాలకు వెళ్లిన ప్రతీ ఒక్కరూ మన దేశాన్ని ఆదుకోవలసిందే. అది విదేశాలలో ఉన్న భారతీయుల కనీస బాధ్యతగా భావించాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది. మన దేశం ఎప్పటికీ మనకి ఆదర్శమే.

భారత్ మాతాకు జై .... వందే మాతరం

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

1. టైటిల్ పేజీ, ఎడిటోరియల్ అన్నీ చాలా బావున్నాయి. సమయానుకూలంగా పత్రిక ప్రచురించారు. పూరి జగన్నాథ స్వామి వైభవం గురించి ఇంతవరకు ఇంత వివరంగా వ్రాయడం ఎక్కడా చూడలేదు. చాలా స్టాండర్డ్ గా అనిపిస్తుంది పత్రిక.
పోడూరి శ్రీనివాసరావుగారు-హైదరాబాదు. శ్రీమతి విజయ భారతి, శ్రీమతి లలిత, శ్రీ శివ ప్రసాద్ ---సికింద్రాబాదు .

2. కొత్త రామానందం గారు సప్త మోక్ష నగరాలు అంటూ అయోధ్య గురించి మొదలుపెట్టారు. చాలా బాగా వ్రాసారు. మళ్ళీ నెల పత్రిక ఎప్పుడు వస్తుందా! అని ఎదురు చూస్తున్నాము. పోడూరి శ్రీనివాసరావు గారు కూడా 'హాస్య బ్రహ్మ జంధ్యాల' నాటకరంగం నుండి గుమ్మడి సలహా ప్రకారం సినీ రంగంలో రచయితగా ప్రవేశించడం అన్నీ వివరంగా బాగా వ్రాసారు.
శ్రీ చంద్ర శేఖర్ , శ్రీమతి విజయ లక్ష్మి ----- పూనా . శ్రీ కమలాకర్ , శ్రీ సురేష్ , శ్రీమతి లత----- కాకినాడ .

3. భువన చంద్ర గారు వ్రాస్తున్న కథలు చాలా బావుంటున్నాయి. సామాజిక విషయాలను వానపాముల, పక్షుల పేర్లతోను ఎంతో అద్భుతంగా వ్రాస్తున్నారు. వారి చక్కటి రచనా శైలికి జోహార్లు. కరోనా గురించి కవిత కూడా బావుంది . పాలకుర్తి రామారావుగారు 'శ్రీ సూక్తం' గురించి వ్రాస్తూ సాధకునిలో ఎటువంటి మంచి లక్షణాలు ఉండాలి అని బాగా వ్రాసారు.
శ్రీ ప్రభాకర రావు, శ్రీమతి అనసూయ, శ్రీమతి లలిత --ఏలూరు. శ్రీ సంతోష్ కుమార్, శ్రీమతి కమల --- ఢిల్లీ .

4. పాలెపు బుచ్చిరాజు గారు రాష్ట్రపతుల గురించి వ్రాయడం బావుంటోంది. వెంకట్రామన్ గారి గురించి చదివి చాలా సంతోషం అనిపించింది. వేమూరి వారి పాకశాస్త్రంలో భాగంగా కాఫీ గురించి కాఫీ అంత టేస్టీ గా వ్రాశారు. ప్రేమంటే ఇంతే లో కృష్ణ మోహన్, అనురాధల కలయిక లో కబుర్లు, పాట పాడమనడం చాలా బాగా వ్రాస్తున్నారు కథ.

5. డా . రుక్మిణీ నాథ శాస్త్రి గారు మాస్కులు, పొడి దగ్గు గురించి బాగా చెప్పారు. మాకు చాలా ఉపయోగ పడ్డాయి మీ చిట్కాలు. కృతజ్ఞతలు. డా. చాగంటి కృష్ణ కుమారి గారు వ్రాస్తున్న గడిలో దాగిన వైజ్ఞానిక నుడి చాలా ఉపయోగకరంగా ఉంటోంది.
శ్రీ రమేష్, శ్రీ అచ్యుత్ , కుమారి స్వర్ణ --- గుంటూరు. కుమారి ఇందు , మాస్టర్ ప్రవీణ్ ---వరంగల్.


6.ఆర్.శర్మ దంతుర్తి గారు మాకు అందిస్తున్న తెలుగు పద్యాలు నిజంగా రత్నాలు, భక్తి మార్గంలో ముంచుతున్నాయనడంలో సందేహం లేదు. పిల్లల కోసమే కాక అందరికీ ఉపయోగ పడేటట్లుగా మంచి కథలు అందిస్తున్నారు ఆదూరి హైమవతి గారు. 'గర్వం పతన హేతువు' అంటూ వ్రాసిన ఈ కథ చాలా బావుంది.
శ్రీ వెంకట్రామన్ . శ్రీ సత్యన్నారాయణ, శ్రీమతి కమల ----- వరంగల్. శ్రీమతి సునీత, శ్రీ రవి, శ్రీమతి అర్చన ----- రాయ దుర్గం.

7. జొన్నలగడ్డ సత్యవతి గారు వ్రాసిన 'ఎఱ్ఱ బస్సు' కథ బావుంది. పాతరోజులకి తీసుకు వెళ్లారు. నందుల ప్రభాకర శాస్త్రి గారు 'మావూరి నందుల కథ'లో చక్కగా పల్లెటూరు తీసుకు వెడుతున్నారు. బావుంటోంది.
శ్రీ పాండు రంగ, శ్రీ నానాగేశ్వర రావు, శ్రీమతి లక్ష్మి ----- బొంబాయి. శ్రీ రమణారావు శ్రీమతి అలివేలు ------ రావులపాలెం .

8. తుమ్మూరి రామ్మోహనరావు రావు గారు గొప్ప కవి, కలెక్టరు అయిన డా. బాపురెడ్డి గారి గురించి వ్రాయడం చాలా సంతోషం అనిపించింది. వారి గురించి చదువుతుంటే చాలా ఆనందం కలిగింది. ఎలక్ట్రాన్ గారు ఏమి వ్రాసినా చాలా బాగా వ్రాస్తారు. ఈ నెల వ్రాసిన 'మతలబుల మనిషి ' టైటిల్ కి తగ్గట్టు బావుంది .
శ్రీమతి రమణి, శ్రీమతి ఉష, శ్రీ మూర్తి-- బందరు శ్రీ వెంకట్, శ్రీమతి శారద, శ్రీ నరసింహమూర్తి ----- తణుకు .

9. 'ప్రహేళిక 'జవాబు చెప్పగలరా? పూర్తి చెయ్యడానికి మాకు చాలా హుషారుగా సరదాగా ఉంటోంది . అలాగే దీపాలు క్యాండిల్స్ వెలిగించి పట్టుకోవడాలు చాలా బాగా కవర్ చేశారు .
శ్రీమతి అనసూయ, శ్రీ వేణు గోపాల్ ---- పిఠాపురం. శ్రీ ప్రశాంత్, శ్రీ రామం ----- హైదరాబాదు .

# కరోనా కవితలు



డా. వేదుల సుబ్రహ్మణ్యం

## కరోనా తో పోరు

బయట లారీల మోతకు భంగపడక
ఇంట నుండుటయే మేలు కంటబడక
ఎంతగా వేడుకొన్నను నుంతయైన
వినగ నొక్కడు నుండడు వీధి బయట II 1

వ్యాధి విస్తారమగునన్న భయము విడిచి
స్వస్థతను నిల్పు విధముగా సాయపడుచు
తరచుగా చేతులను శుభ్ర పరచు కొనుచు
ఇంటనే యుండుటొప్పగు నెల్లరకును II 2

ఇంటి నిర్బంధమున నుండ నించుకైన
బాధ్యతలు పంచుకొను గొప్ప భాగ్యమగును
ఇప్పుడున్న పరిస్థితి నెంచి జూడ
మించి కానదు వేరొక మేలు ప్రజకు II 3

ప్రజలు వ్యాధికి భీతిల్లి పరుగు లిడగ
సర్వసామర్థ్యములు గల సాధకుండు
దేశమెల్లను పాలించు ధీరుడొకడు
పోరు సల్పగ దిగులు తా తీరిపోదె? II 4

విషపు జ్వాలలు దేశాల విస్తరించి
ఇప్పటికె ప్రుగ్గి రెందరొ ఎగ్గు నుడిగి
శరణు వేడెద నయ్య ఓ గరళకంఠ !
కాడుమల్లేశ! మమ్ముల గావు మీశ II 5

దేశ మందిచ్చు జ్యోతుల దీప్తి వెడలి
వివిధ దేశాల మూలల విస్తరించి
దీపశిఖ మధ్య పరమాత్మ తేజరిల్ల
శార్వరీ మాత గాచుత జగతి నెల్ల II 6

## కరోనా యుద్ధ వీరులకు వందనములు

రోగులకు సేవలందించి బాగు చేయు
పనికి అంకితమై యుండి ప్రాణమొడ్డి
అహరహంబులు కృషిజేయు నందరకును
వందనమ్ములు శతకోటి వందనములు II 7

అలుపు సొలుపుల నెరుగక సలుపు విధులు
ప్రభుత నియమాలు నేర్పుతో ప్రజకు తెలిపి
భద్రతను కూర్చు రక్షక పాలకులకు
వందనమ్ములు శతకోటి వందనములు II 8

పారిశుద్ధ్యము పాటించి పరిసరముల
పారిశుభ్రత కాపాడు పనులలోన
ప్రీతితో సేవ లందిచ్చు బృందములకు
వందనమ్ములు శతకోటి వందనములు II 9

వ్యాధితో పోరు సల్పి ప్రయాస కోర్చి
ప్రజల రక్షణకై తాము పరితపించి
దక్షతను నిల్పు వైద్య బృందములకెల్ల
వందనమ్ములు శతకోటి వందనములు II 10

దేశ భద్రత మదినిల్పి దిశలగాచి
ప్రాణములు లెక్క జేయక పణము పెట్టి
దేశ రక్షణకై పోరు ధీరులకును
వందనమ్ములు శతకోటి వందనములు II 11

ఒకడు విషమును పంచి ఇంకొకడు మించి
ఉగ్రవాదుల పంపినా ఉచితమెంచి
ఔషధము లందరకు పంచు నమ్మ కిత్తు
వందనమ్ములు శతకోటి వందనములు II 12

# అందరికి ఈ కరోనా వైరస్ నుండి విముక్తి పొందాలని కోరుతూ

కరోనా ఇకనైనా కరుణ చూపవా!
నీకేమివ్వ గల దాననురా! కరోనా ఇకనైనా కరుణ చూపవా!
కరోనా నీవే అందరికి వైరస్ ఇవ్వగల దానవులు! నీకే-మివ్వ గల దాననురా!

ముందే ఇచ్చితిని నమస్కార సంస్కారములు!
తుమ్మితే ఆగమని ముందే చెప్పితిని!
మునుపే ఇచ్చితిని మడి ఆచారాలు!
పసుపు గడపల ముందే జల్లితి కళ్లాపులు!
కరోనా ఇకనైనా కరుణ చూపవా! నీకేమివ్వ గల దాననురా! కరోనా ఇకనైనా కరుణ చూపవా!

సెలవులు ఇచ్చితివి, పరీక్షలు నిలిపితివి!
బస్సులు ఆపితివి, విమానాలు నిలిపితివి!
గుడులు మూసితివి, బడులు నిలిపితివి!
కొందరికి ఉసూరే నిలిపితివి!
కరోనా ఇకనైనా కరుణ చూపవా!

దేవతలేమో గుడి వదిలి వైద్య నారాయణులై ప్రాణము అడ్డు వేసి కాపాడుచున్నారు!
అష్ఠ దిక్పాలకులు మనకు రక్షణ నిచ్చే భటులై IPL Batting చేసి రక్షించు చున్నారు!
పారిశుధ్య కార్మికులు మనకు తల్లి తండ్రులై చంటి పిల్లాడిని శుభ్రం చేసినట్లు చేస్తున్నారు!
కరోనా ఇకనైనా కరుణ చూపవా!

మిత్రులతో కలిసి అరుగు మీద కూర్చుని ముచ్చట్ల మాట దేవుడెరుగు, అసలు ముఖాముఖి మాట్లాడే వారెవరు!
పండుగనాడు బంధు జనులతో కలిసి గుడిలో పంచాంగ శ్రవణం మాట దేవుడెరుగు, ఇద్దామన్న పంచాంగం పుచ్చుకొనే వారెవురు!

ఓం! కరోనా నాశాయః శ్రీ వేంకటేశ్వరాయ నమః

నారాయణుడు తన మెడ లోని తులసి మాలను _Stethoscope_ చేసి మనలకు వైద్యము చేయడానికి వైకుంఠం దిగి వచ్చాడు!

వేంకటేశ్వరుడు తన మెడ లోని కఠారి సరమును _Stethoscope_ చేసి మనలకు వైద్యము చేయడానికి తిరుమల దిగి వచ్చాడు!

నరసింహుడు ప్రహ్లాద భక్తికి మెచ్చి అహోబిలం దిగి _Stethoscope_ మెడలో వేసుకుని మనలకు వైద్యము చేయడానికి వచ్చాడు!

భ్రమరాంబికా మల్లన్న తన మెడలో ఉన్న వాసుకిని _Stethoscope_ చేసి మనలకు వైద్యము చేయడానికి శ్రీశైలం దిగి వచ్చాడు!

ఆంజనేయుడు తన మెడలో ఉన్న రామ దండను _Stethoscope_ చేసి మనలకు వైద్యము చేయడానికి నెట్టికంఠి నుంచి వచ్చాడు!

సాయి అల్లాహ్ జీసస్ బసవ గురు జీనా బుద్ధా ఎందరో మహా పురుషులు దిగి వచ్చి _Stethoscope_ నే

ఆయుధము చేసుకుని వైద్యము చేయడానికి దిగి వచ్చారు!

అందరికి ప్రార్థన, మీకిష్టమైన దైవాన్ని రోజు 5 నిమిషా-లైనా ప్రార్థన చేయండి. అంతకు మించి అందరు ఇంటి లోనే ఉండి వైద్య నారాయణులకు తోడ్పడండి!
వేం*కుభే*రాణి

Happy Saturday n Stay home Sunday ya Monday n help Divine Doctors.

\- వేం*కుభే*రాణి

# పూరి జగన్నాధ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది. కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్మ్యాన్ని యధామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందడి.

- సంపాదకురాలు

11 వ అధ్యాయం

జైమిని ఋషి సంవాదం

( ఇంద్రద్యుమ్నుడు నీలాచలానికి బయలుదేరుట) మహర్షి1మీసాంగత్యంవలననాలోనిభవ బంధాలన్ని తొలగిపోయాయి. మీ బోధనల వలన నీలమాధవుని దర్శించుకోవాలనే కోరిక అధికమవుతోంది. ఆ పురుషోత్తముని దగ్గరకు బయలుదేరుదాము. మీరు మాతో రండి' అని రాజు నారదుని ప్రార్ధించాడు.

" రాజా! పురుషోత్తమ క్షేత్రాన్ని, అక్కడ ఉన్న తీర్థాలను నేను దగ్గర ఉండి చూపిస్తాను. నీవుస్వామిని తప్పక దర్శించుకొనగలవు. అక్కడ స్వామి నాలుగు రూపాలలో దర్శనం ఇస్తారు." అని నారదుడు అనుజ్ఞ ఇచ్చాడు.

జ్యేష్ట శుక్ల పంచమీ బుధవారం పుష్యమీ నక్షత్రంలో యాత్రకు సరయిన ముహూర్తంగా దైవ జ్ఞులు నిర్ణయించారు." యావజ్జీవితంనీలాచలంలో నివసించడాలనే కోరికగల ప్రజలను బయలు దేరమని రాజు చాటింపు వేయించాడు.

రాజ బంధువులు, సైన్యం, మంత్రులు, బ్రాహ్మణులు, వివిధ వృత్తులవారు తమతమ

సంభారాలు తీసుకొని బయలుదేరారు.

బ్రాహ్మణులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం వివిధ సూక్తాలతో, మంత్రాలతో , వివిధ తీర్థజలాలతోరాజును అభిషేకించారు. తెల్లనివస్త్రాలు ధరించి యధావిధిగా పితృగణాలనుఅర్చించారు. జయహోమం, గణహోమం నిర్వహించారు. అగ్నికి ప్రదక్షిణ చేసారు. నవగ్రహాలను పూజించారు. రాజు పట్టువస్త్రాలు ధరించి, సర్వాలంకార భూషితుడై యాత్రకు బయలుదేరాడు.

వందలాది శంఖాలు పూరించారు, అనేక వాద్యాలు మ్రోగించారు. రాజు నృసింహునిదర్శించు కున్నాడు. పురోహితులు స్వామి మాలను రాజుకు సమర్పించారు. దేవాలయానికి ఎదురుగా ఉన్న పదిగుర్రాలు ఉన్న రథాన్ని నారదునితో కలిసి అధిరోహించాడు.

ఆ రథం నీలాద్రి పర్వతంపైపు ప్రయాణిస్తోంది.

మార్గం చాల కష్టంగా ఉంది. అరణ్య మార్గంలోని సుందర దృశ్యాలను చూస్తూ ఉత్కళ దేశ ( ఒరిస్సా) సరిహద్దులకు చేరుకున్నారు. అక్కడ ఉన్న 'చర్చికా దేవిని' దర్శించుకున్నాడు. ఆమె పుర్రె మాల ధరించి ఉంది. నారదునిఆజ్ఞనుఅనుసరించి ఇంద్రద్యుమ్నుడు రథాన్ని దిగి వినయంగా చర్చికాదేవిని సమీపించి, సాష్టాంగ నమస్కారం చేసి ఈవిధంగా ప్రార్థించాడు.

ఇంద్రద్యుమ్నుడు చర్చికా దేవిని స్తుతించుట-----

నమస్తే త్రిదశేశాని సర్వాపద్వినివారిణి

బ్రహ్మవిష్ణు శివాద్యాభిః కల్పనాభి రుదీరితే

కారణం జగతామాద్యే ప్రసీద పరమేశ్వరి

త్వయావినా జగన్నైతత్ క్షణముత్సహతే శివే

సిద్ధయః సర్వ కార్యాణాం మంగలానిచ శాశ్వతే

త్వత్పాదారాధన ఫలం మర్త్యలోకేహి నాన్యధా

చరాచర పతేర్విష్ణోః శక్తి స్త్వం పరమేశ్వరి

యయా సృజత్యవతిచ జగత్సంహరతే విభుః

చరాచర గురుం దేవం నీలాచల నివాసినమ్

అనుగృహ్ణీస్వ మాం యధాపశ్యే స్వ చక్షుషా

" ఓ దేవి! నీవు సమస్త దేవతలకు అధి పతివి. బ్రహ్మ,విష్ణు, శివ అనే పేర్లతో పిలవబడు

చున్నావు. జగత్తుకు మూలకారణము నీవే. నీవు లేనిదే ఈ లోకము నిలువలేదు. సకల శుభాలకు, సర్వకార్య సిద్ధికి నీ పాద సేవయే మార్గం. విష్ణువు నకు శక్తిని ఇచ్చుదానవు నీవే. నీలాద్రి నాధుని కన్నులతో చూచునట్లు అనుగ్రహించు" అని రాజు ప్రార్ధించాడు. ( 1 - 97)

ఈవిధంగా చర్చికా దేవిని ప్రార్ధించి రాజు రధాన్నిఎక్కి అచలాద్రికి బయలుదేరాడు. మధ్యాహ్న సమయానికి మహానదీ తీరానికి చేరుకున్నాడు. మధ్యాహ్నసంధ్యాదికార్యక్రమాలనునిర్వహించుకొని, నారదునితో కలిసి భోజనం చేసాడు.

సాయం సమయంలో రాజు అక్కడే సభ నిర్వహించాడు. చంద్రోదయం అయింది. కవులు గాయకులు రాజు కీర్తిని వర్ణిస్తూ గానం చేసారు. నర్తకీ మణులు నృత్యం చేసారు. రాజు అక్కడకు వచ్చిన వైష్ణవ భక్తులను, రాజులను తగిన రీతిని సత్కరించాడు. నారదుని ఉచితాసనంపై కూర్చోబెట్టి, తగిన రీతిని సత్కరించి, " మహర్షి! విష్ణువు చరిత్రను నీవు జ్ఞాన శక్తిచే తెలుసుకున్నావు. ఆ చరిత్రనునాకు చెప్పినా మనస్సులోఉన్నబురదను కడిగివేయి" అని ప్రార్ధించాడు.

ఇంతలో ఉత్కల దేశపు రాజ సేవకుడు వచ్చి తమ రాజు ప్రవేశించుడానికి అనుమతించమని విన్నవించుకునాడు.ఇంద్రద్యుమ్నుడు అను మతించగా ఉత్కళరాజు లోనికి ప్రవేశించాడు. ఇంద్రద్యుమ్నుడు వైష్ణవ భక్తుడైన ఆ రాజును గౌరవించి ఉచితాసనంపై కూర్చోబెట్టి, రాజా! సకల శుభాలు కలుగుతున్నాయా? నీలాద్రి స్వామికి జయం కలుగుతోందా? నీవు ఆ స్వామిని భక్తితో సేవిస్తున్నావా? " అని అడిగాడు.

" రాజా! నీ అనుగ్రహం వలన సకల శుభాలు సమకూరుతున్నాయి. నీ పాలనలో ధర్మం నాలుగు పాదాలలో నడుస్తోంది. నీవు సాక్షాత్ విష్ణు స్వరూపుడవు.

ఇక్కడ దక్షిణ సముద్ర తీరంలో ఉన్న అరణ్యంలో నీలాద్రి పర్వతం ఉంది. ఆ పర్వతంపై స్వామి ఉన్నాడు. ఇక్కడ ఏర్పడిన గాలితుఫానుకి స్వామి ఇసుకచే కప్పివేయబడ్డాడు. ఆనాటినుండి నా రాజ్యంలో దుర్భిక్షం ఏర్పడింది. నీ రాక వలన నా రాజ్యం సుభిక్షం అవుతుంది అని అనుకుంటు న్నాను" అని రాజువిన్నవించుకున్నాడు.

ఆమాటలువినగానేఇంద్రద్యుమ్నుడువిచారించి, " నారదా! ఇదేమిటి? నేను దేనికోసం ఇంతదూరం వచ్చానో అది వ్యర్థం అయిపోయింది" అని పలికాడు.

" రాజా! విచారించకు. విష్ణుభక్తుల కోరిక విఫలం కాదు. స్వామిని నీవు చూస్తావు. నిన్ను

(19 వ పేజీ చూడండి)

# కరోనా పై కవిత

రాజ్యశ్రీ పొత్తూరి

కరోనా కరోనా కృప కరొన

హమ్ స్బకో బహుత్ మత్ daraana

అమాయకులం మేము అవునా

అమానుషం నీకు తగునా

ఎక్కడో పుట్టిన నీ పయనం ఇక ఆగునా.

ఎప్పటికి ఈ పతనం ఇలాగే సాగున.

కానరాని దైవానికి మా పై. కరుణ లేదు.

కనిపించే నీ వైరానికి మా పై కనికరం లేదు.

కంటి ముందు సాటివారు కడతేరుతుంటే

కన్నీటితో కొత్త చరిత్ర రాస్తున్నాము.

ఆపలేవా ఇక నీ ఆరాటం

జరపలేము ఇక ఈ పోరాటం. I

కొలువులకు చదువులకు సెలవు.

పండుగలు వేడుకలు చెల్లవు.

వినలేము పంచాంగ శ్రవణం.

కనలేము రాముని కళ్యాణం.

ఇరుగు పొరుగు తో మాటలు లేవు.

పిల్లాపాపల ఆటలు లేవు

దూరవాణి చరవాణి చెప్తున్నాయి భవిష్య వాణి

దురదర్శినితో దగ్గరవుతున్న కుటుంబ సభ్యులు

మనసువిప్పి మాట్లాడుతున్న. మంచి మిత్రులు.

క్షణ క్షణం భయం భయం

ఎవరిస్తారు అభయం.

బిక్కు బిక్కుమనే బీద వర్గాలు

దిక్కు కొక్కరున్న ధనిక వర్గాలు

కారెవరు కరొన కి అనర్హం.

కన్ను మూసినా కన్ను తెరిచిన.

కలలోనైనా కలుసుకున్న వారితో ఐన

కరొన జపమే.

మా ప్రభుత్వాలు మమల్ని కాపడుతున్నా

హే భగవాన్ కరొన సే దూర్ కారోనా

# సప్త మోక్ష నగరాలు



కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మై నది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమై నది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగ- వంతుడే పర- మావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయత్తమై న వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపురుషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్థ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవరనను నిరోత ధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్ర- మాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదు- రైనప్పుడు ఏమై నా మహిమాన్విత శక్తి తనకు సహక క్తి రించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్ర- యత్నమే --- భక్తి మార క్తి గం . భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తా డు. అందరికీ ప్రేరణ ఇస్తా డు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయడానికి ఎ క్తి న్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప నగరాలు ఉన్నాయి. అందు పరత - మాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప మోక్ష నగరాలు మోక్షత ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాది- స్తు న్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చే- యగలుగుతున్నాము. ధర్మ బద్ధమై న జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయ క్తి త్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటి- నీ సమై క్య పరచి ముందుకు నడిపిస్తుంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రా- లు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

**అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జ- యిని) మరియు ద్వారక.**

# 1. రాముడు నడయాడిన పుణ్య స్థలి: అయోధ్య

(గత సంచిక తరువాయి)

అయోధ్యలో యాత్రికులు చూసి తరించాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. అన్నింటినీ చూడాలనుకునే వారు 2 రోజులు ఇక్కడ ఉండి అన్నింటినీ తిలకించవచ్చును. సందర్శకులకు సత్రవులు, ఆశ్రమాలు, లాడ్జీలు మెండుగా ఉన్నాయి. సరయూనది అందాలు హనుమాన్ గఢీ, జానకీ మహల్, రామ జన్మభూమి, కాలేరాం ఆలయం, దశరథ భవనం, నంది గ్రామం హదీతారా స్థలాలను కాలినడకన గాని, ఆటోలలో గాని వెళ్లి తిలకిస్తారు.

### సరయూ నది :

వైవస్వత మనువు పుత్రుడు ఇక్ష్వాకుడు అయోధ్యను ఏలుతూ నగరంలో మరే నదీ లేక పోవడం వల్ల, కుల గురువైన వసిష్ఠుల వారిని ఒక నదిని రప్పించమని అర్థించాడు. వశిష్ఠుడు తన జనకుడైన బ్రహ్మ గారిని ప్రసన్నం చేసుకోగా బ్రహ్మ మానస సరోవరం నుంచి సరయూనది పేరుతొ అయోధ్యకు ప్రవేశింప జేయడానికి అనుమతి నిచ్చాడు .

అయోధ్యకు సరయూనదిగా మానస సరోవరం నీరు ప్రవహించి ఈ అయోధ్య ప్రాంతాన్ని పునీతం చేసింది. ఈ నదిలో ప్రతీ యాత్రీకుడు స్నానమాచరించి పునీతులవుతారు.



పెద్దలకు పిండ ప్రదానములు గావించి, వారి పుణ్య లోక ప్రాప్తికి శ్రీరామచంద్రమూర్తి వారిని ప్రార్థిస్తారు. శ్రీ రామచంద్రుడు తన అవతార సమాప్తి ఈ నదిలోనే గుప్తర్ ఘాట్ లో జరిగినట్లు పురాణాలు చెపుతున్నాయి. అయోధ్య లోని నదీ తీరాన అనేక చోట్ల ఆలయాలు, ఆశ్రమాలు, సత్రవులు ఉన్నాయి. వెయ్యి మన్వంతరాలు కాశీలో నివశిస్తే వచ్చిన ఫలితం, అరవై వేల సంవత్సరాలు గంగా స్నానం ఆచరిస్తే లభించే పుణ్యం, జల రూప బ్రహ్మ అయిన సరయూ నదిలో ఒక సారి స్నానం చేసినంత మాత్రానే లభిస్తుంది అని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ యాత్రికుల స్నానాల నిమిత్తం 31 స్నాన ఘాట్లు ఏర్పాటు చేశారు.

### కాలేరాం ఆలయం :

సరయూనది ఒడ్డున ఈ ఆలయాన్ని విక్రమాదిత్యుడు కట్టించినట్లు, కాల క్రమేణా మొగలాయి చక్రవర్తులు శిథిల పరచిన కారణమున రామ లక్ష్మణ భరత శత్రుఘ్న, హనుమాన్ విగ్రహాలను నేటి "కాలేరాం" ఆలయంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీ రాముడు నలుపు రంగు వాడగుట చేత 'కాలేరాం' అని ఆలయాన్ని పిలుస్తున్నారు.

### హనుమాన్ గఢి:

ఈ ఆలయంలో దైవమయిన హనుమంతుని చూచుటకు 76 మెట్లు ఎక్కి వెళ్లి స్వామిని దర్శించుకోవాలి. శ్రీ రామ చంద్రునితోపాటు తాను కూడా సరయూన-

దిలో ప్రాణ త్యాగం చేయబూన, శ్రీ రాముడు మారుతికి నచ్చ చెప్పి 'అయోధ్యలో ఉండి భక్తుల యోగ క్షేమాలను చూచుకోమని' ఆనతి ఇచ్చారు. అందువల్ల ఈ ఎత్తైన ఆలయంలోనే నేటికీ ఉంటూ, భక్తుల మనోభీష్టములను నెరవేర్చుచున్నాడు. స్వామి మందిరంలో ఉన్నట్లుగా దర్శనమిస్తారు. భక్తులు 'పాలకోవా ' ను ప్రసాదముగా నివేదిస్తారు.

### కనక భవనం:

అయోధ్య సందర్శకులందరికి బాగా నచ్చే దర్శనీయ స్థలం ---- కనక భవనం. సీతారాములు నూతన దంపతులుగా మిథిలా నగరం నుండి ఇచ్చటకు వచ్చిన సందర్భములో కైకేయి ప్రేమతో తన కోడలును దీవిస్తూ అమూల్యమైన మణిమయ బంగారు భవనాన్ని ఇచ్చిందంటారు. సీతా రాములు ఈ భవంతిలో ఉండేవారని ఇక్కడి వారు నమ్ముతారు. ఆ భవంతిలో పాల రాతి సీతా రాముల విగ్రహాలు ఉన్నాయి. నిత్యా పూజలు జరుపుతుంటారు. ఆ హవానా మొదటి అంతస్థులో సీతారాముల పడక గది ఉందట. రోజూ అక్కడ పాన్పు అలంకరించి పూలు జల్లుతారట. తెల్లవారే సరికి వాటిపై ఎవరో పడుకున్నట్లు అవి నలిగి ఉంటాయట. ఈ గది వద్దకు భక్తులను వెళ్లనీయరు.

ఈ భవన శిలా ఫలకంపై ఉన్న వ్రాతలు ప్రకారం ఈ భవనాన్ని దరిమిలా కుశుడు ద్వాపర యుగారంభంలో వృషబ్ మహరాజు



పునర్నిర్మాణాన్ని గావించినట్లు, విక్రమాదిత్యుడు 839 లోను 888లో సముద్ర గుప్తుడు ఈ భావన జీర్ణోద్ధరణ గావించారుట.

ద్వాపర యుగంలో రుక్మిణి శ్రీకృష్ణుడు అయోధ్యను సందర్శించి, ఈ భవనంలో చాలా రోజులు గడిపారంటారు.

### రామ జన్మభూమి:

53 ఎకరాల్లో ఉన్న రామజన్మ భూమిని చూచుటకు యావత్ భక్త జనం ఉవ్విళ్లూరుతారు. ఈ పుణ్య స్థలం వివాదాస్పదంగా మొన్నటివరకు ఉండుటచే గట్టి పోలీసు బందోబస్తు మధ్యలో భక్తులను క్యూలైన్లలో ప్రవేశపెట్టి దర్శనం కలగజేసేవారు. ఇప్పుడు ఇక్కడ ఉన్న ఒక చిన్న గుడారంలో ఉన్న సీతారామ విగ్రహాలను చూడవచ్చును. నేడు ఆ ప్రాంతంలో ఇక్ష్వాకుల వంశ వైభవం కానీ రామ లక్ష్మణ భారత శత్రుఘ్నులు ఆటపాటలతో గడిపిన గుర్తులు కానీ పక్కా గుడి కానీ ఏమీ చూడ లేము. అక్కడ నేడు ఉద్రిక్త పరిస్థితి మాత్రం కానవస్తుంది. హిందువులు, ముస్లిములు మధ్య జరిగిన న్యాయ



పోరాటం సుప్రీం కోర్టు అంతిమ తీర్పుతో ముగిసింది. ఈ వివాద స్థలము హిందువుల రామ జన్మ భూమిగా తీర్పు ఇచ్చారు. మరియు ఆలయ నిర్మాణ కమిటీ ఆలయ నిర్వహణ ట్రస్టులను ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణ ప్రణాళికలు చురుకుగా తయారవుతున్నాయి. పూర్వ వైభవాన్ని త్వరలోనే మన ముందు ఆవిష్కరించనున్నారు. అయోధ్య క్షేత్ర వికాస పరిషత్తువారి ఆధ్వర్యంలో అయోధ్య నగరాన్ని ఒక సుందర నగరంగా తీర్చబడుతుంది. ఎట్టి సందేహమూ లేదు.

1. సరయూ నది తీరాన ప్రపంచములోనే ఎత్తయిన 251 మీటర్ల ఎత్తు గల శ్రీరామ చంద్రమూర్తి దివ్య మంగళ విగ్రహాన్ని నెలకొల్పుతారు.

2. 2 వేల మంది శిల్పులు రోజుకు 8 గంటలు పనిచేస్తే 2/12 సంవత్సరాలలో భవ్యమైన మందిర నిర్మాణం పూర్తి అయేలాగున చర్యలు తీసుకొంటున్నారు. ఇప్పటికే 65% రాతి చెక్కడం పనులు శిల్ప నిర్మాణం పనులు పూర్తి అయ్యాయి.

3. ధర్మ క్షేత్రంగా పుణ్య స్థలంలో దేశంలోనే అతి పెద్ద ఆలయంగా ఉండే లాగున పనులు మొదలు పెట్టనున్నారు.

4. నగర రూపు రేఖలు పూర్తిగా మార్చివేసే ప్రణాళికలు.:

a. అంతర్జాతీయ విమానాశ్రయం.

b. అయోధ్య నుండి ఫైజాబాద్ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణం.





c. 100 కోట్ల ఖర్చుతో రైలు స్టేషన్ విస్తరీకరణ.

d. సరయూనదిలో విహరించుటకు క్రూజ్ .

e. అంతర్ రాష్ట్రీయ బస్ స్టేషన్ నిర్మాణం.

f. 10, 000 ల భక్తులకు ఆవాస నిర్మాణ పనులు.

g. 5 నక్షత్రాల హోటల్ నిర్మాణాలు.

h. 10 విశాలమైన రిసార్ట్ నిర్మాణ పనులు.

i. A క్లాసు నగరంగా విశాలమైన రహదారులు.

j. నగరంలో శ్రీరామ ద్వారాలు ఏర్పాటు.

k. గోశాల, ధర్మశాలల నిర్మాణాలు .

l. 77 ఎకరాల్లో ధార్మిక సంస్థల ఏర్పాటు.

m. స్వామికి సంబంధించిన 10 నీటి కొలనులు పునర్నిర్మాణ చర్యలు .

n. నంది గ్రామానికి నూతన శోభ .

o. నగరంలో ఉన్న ఆలయాలను సుందరీకరణ .

మున్నగు ఎన్నో ప్రణాళికలు చేపట్టి ట్రస్టుకు వచ్చే విరాళము-



లతో అయోధ్య నగరాన్ని రాబోవు 4 సంవత్సరములలో అత్యంత సుందరమైన యాత్రా స్థలంగా రూపుదిద్దనున్నారు .

నగరంలో ఇతర దర్శనీయ స్థలాలు :

**నాగేశ్వర మందిరం:**

సరయూనది చేరువలోనే ఉన్న ఈ శివాలయాన్ని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా ఈ ప్రాంత వాసులు నమ్ముతారు. ఈ మందిరాన్ని శ్రీరామచంద్రమూర్తి తనయుడు కుశుడు నిర్మించాడంటారు. అలా నిర్మించుటకు ఒక కారణం ఉన్నదట. ఒక పర్యాయం కుశుడు సరయూనదిలో స్నానం చేస్తుండగా ఆయన కంకణం నదిలో పడిపోయిందట. ఎంత వెతికినా కానరాలేదట. ఆ కంకణాన్ని నాగరాజు కుమార్తె తీసుకుంది. కంకణం దొరకనందున నదిపై అగ్ని బాణం ప్రయోగించాడట. ఆ బాణ ప్రభావం వల్ల నదిలోని జల ప్రాణులు నశింప సాగాయి. భయంతో నాగరాజు శివుని శరణు వేడి తమ జాతిని రక్షించమని వేడుకున్నాడు. దయామయుడైన నీలకంఠుడు, నాగరాజు మరియు కుశుల మధ్య మిత్రత్వం ఏర్పాటు చేసి, నాగరాజు కుమార్తెను కుశునికిచ్చి వివాహం జరిపించాడు. కంకణాన్ని కుశునికివ్వడం జరిగింది. ఈ సన్నివేశానికి గుర్తుగా ఈ స్థలంలో నాగేశ్వర నాథ మందిరం నిర్మించారు. ఆలయంలో ఒక వెసులు బాటు ఉంది. భక్తులు సరయూనది



నీటితో శివాభిషేకం స్వహస్తాలతో చేసుకొని వచ్చును.

**దశరథ భవనం :**

ఇచ్చటి ఆలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలు తిలకించవచ్చును. బాల హనుమంతుని విగ్రహం కూడా దర్శించ వచ్చును.

**వాల్మీకి భవనం:**

వాల్మీకి లవకుశుల చేత ఇచ్చటనే ప్రప్రథమంగా రామాయణం గానం చేయించారు. ఇచ్చటి మందిర గోడలపై రామాయణం కథ వ్రాయబడి ఉంది. ఇచ్చట లవకుశులు మరియు వాల్మీకి విగ్రహాలు చూడవచ్చును.

**గిరిజా దేవి మందిరం :**

సీతమ్మ వారు తనతో తెచ్చుకున్న గిరిజా దేవి విగ్రహానికి మామ దశరథుడు ఒక గుడి కట్టించి అందులో ఆ విగ్రహాన్ని ప్రతిష్ట చేసాడు.

**నంది గ్రామం :**

ఇచ్చటనే భరతుడు రాముని తరపున ఆయన పాదుకలను ఉంచి 14 సంవత్సరములు పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించాడు. భరతుడు ఉన్న ఆశ్రమ ప్రశాంతతను అందరూ ఆస్వాదిస్తారు. ఇచ్చట ఆంజనేయుడు, భరతుడు ఒకరినొకరు కౌగిలించుకున్న పాలరాతి విగ్రహాన్ని చూడగలం. చాలా సుందరంగా మలిచారు. ఇద్దరురామ భక్తుల కలయిక !

అయోధ్య నగరంలో వివిధ ప్రదేశాలు దర్శించిన పిదప సంతృప్తితో, శ్రీరామచంద్రుని తమ గుండెల్లో పదిల పరుచుకుని ఎన్నో స్మృతులను దాచుకుని, అయోధ్య యాత్ర పూర్తి చేసుకుని "జై శ్రీరామ్ " అంటూ నమస్సులు అర్పించి తమ తిరుగు ప్రయాణం ప్రారంభిస్తారు.

# ఎదురు చూపు

## భువనచంద్ర



" అవన్నీ నమ్మకూడదు నాయనా .... మనుషుల్లాగే జంతు లోకంలో కూడా సామెతలూ, కొన్ని విచిత్రమైన పద ప్రయోగాలూ పుట్టుకొచ్చాయి. విని ఆనందించడమే తప్ప నమ్మకూడదు" అనునయంగా అన్నాడు సమదృష్టి కొడుకైన ఏకదృష్టితో .

"మీ మనుషుల్లాగే మన వాళ్ళు, అంటే జంతు జాలమూ పక్షి జాలమూ కుడా అబద్ధాలు నేర్చుకుంటే మన విలువ ఎంత హీన స్థితికి దిగ జారుతుందీ?" ముక్కుని కొమ్ము కేసి బర బరా గీకి అన్నాడు ఏక దృష్టి. అసలు కారణం ఏమంటే ---

<<<<<<<

వక్ర బుద్ధి అనే ఓ తోడేలు తన తమ్ముడైన ఇష్ట సిద్ధి భార్య హేమంతిని బలాత్కారం చేసాడు. దానికి రుజువులే గాక క్షర, అక్షర అనే రెండు కుందేళ్ళు కుడా ప్రత్యక్ష సాక్షులు కావడంతో వజ్రకాయ మహారాజు వక్రబుద్ధికి మరణ దండన విధించక తప్పలేదు. అయితే ఆయన మరొక దండన విధించే లోగానే రాజ్యం నుంచి క్షర అక్షరలు మాయం అయ్యాయి. సాక్షుల్ని ప్రవేశ పెట్ట లేక పోయినందున కేసు కొట్టి వేసినా, "వక్ర బుద్ధీ నువ్వు ... నువ్వు చేసిన పనికి నిన్ను చంపి కాకులకీ గద్దలకీ పడేస్తాను. ఇది హరి హరాదులు అడ్డొచ్చినా తప్పదు", అన్నారు వజ్రకాయులవారు. వారు ప్రతిజ్ఞ చేసి ఆరేళ్ళయినా ఇంకా వక్ర బుద్ధి గారు జంతు ప్రపంచంలో నిస్సిగ్గుగా సంచరిస్తునే ఉన్నారు .

అడగాలని అందరికీ ఉంది. కానీ అడిగే దెవరూ? అడగాలంటే మంత్రుల ద్వారా వజ్ర కాయుణ్ణి అడగాలి వజ్రకాయుడికి చెప్పే ధైర్యం మంత్రికి ఉందా? పేరుకి ప్రజాస్వామ్యం. నడిచేది వజ్ర కాయుడి ఇష్టం. అందరూ ప్రజల ద్వారా ఎన్నుకోబడ్డ వారే. (ఇక్కడ ప్రజలంటే దండకారణ్యంలోని జంతువులని అర్ధం. పశువుల్ని మనుషులుగా పిలుస్తున్నప్పుడు పశువుల్ని జనాలుగా ఎందుకు పరిగణించకూడదూ ?)

" తండ్రీ మనుషుల్లోని సామెతల్ని మనం వాడటంలో తప్పుందో లేదో నాకు తెలియదు కానీ ఆ సామెతలతో నిజాన్ని పూడ్చి పెట్టడమే మనం చేస్తున్న తప్పు. ఈ తప్పు అరణ్యాన్ని దహించక మానదు" క్రోధంతో దహించాయి కళ్ళు.

దండకారణ్యానికి ఉత్తర భాగాన ఉన్న ఘోటకారణ్యంలో ఓ హత్య జరిగింది. తనని ప్రేమించడం లేదన్న కారణంతో ఓ యువ పులి ఓ ఆడ పులిని రాత్రి వేళ దాడి దాడి చేసి చంపేసింది. న్యాయం కోసం ఆడపులి తల్లితండ్రులు వజ్రకాయుడ్ని ఆశ్రయించారు. అయితే ఆడ యువ పులి చని పోయింది. మగ పులి పంజా దెబ్బ వల్ల కాదనీ, ఓ భయంకర విష సర్పం కుట్టడం వల్లననీ శవ పరీక్ష వల్ల తేలింది. ఆ శవ పరీక్ష చేసింది శవ పరీక్షలో ఎక్స్ పర్ట్ అయిన వక్రబుద్ధి.

"ఇది లంచంతో కప్పెట్టిన నిజం మహారాజా, వక్రబుద్ధి పరీక్షలో న్యాయం లేదు" ఘోషించారు ఆడపులి తల్లితండ్రులు.

"సరే, పక్క రాజ్యం నుంచి మరో శవపరీక్షా నిపుణుడ్ని పిలిపిస్తాం. శవాన్ని భద్రంగా, పరీక్ష పూర్తయ్యేదాకా మీరే కాపాడాలి" ఆజ్ఞాపించాడు వజ్రకాయుడు. పక్క దేశం నుంచి యీ దేశానికి రావాలన్నా, యీ దేశం నుంచి పక్క దేశానికి పోవాలన్నా లక్షా తొంభై రూల్సూ, రెగ్యులేషన్సూ.

"పోనీలేండి మహారాజా, మా బిడ్డ శవాన్ని కుళ్ళిపోయేదాకా ఉంచడంకంటే, మా ప్రాణాలు వదిలేయడమే సుఖం. పోనీలేండి,

'దాని రాత' అనుకుంటాం" ఆడపులి తల్లిదండ్రులు ఏడుస్తూ బిడ్డను తీసుకుపోయారు. చిద్విలాసంగా మీసం దువ్వుకున్నాడు వజ్రకాయుడు. లోలోపలే నవ్వుకున్నాడు వక్రబుద్ధి.

సత్వర తీర్పు ఇవ్వకపోవడం అంటే, న్యాయాన్ని చంపెయ్యడమే" అన్నారు లీడింగ్ లాయర్ కదిరి ఫాక్స్ అనబడే నక్కగారు.

"యస్... జస్టిస్ డిలేడ్ ఈజ్ జస్టిస్ డినైడ్' ఇంగ్లీష్ లో అన్నారు వెకేషన్ జడ్జ్ వేలాయుధం పేరు గల మరో వృద్ధ నక్క గారు.

"నా బొంద .... ఆటవిక న్యాయం ఆటవిక న్యాయమే. బలహీనుడెప్పుడూ పరాజితుడే. బలవంతుడి కసలు న్యాయంతో పనేముందీ?" అన్నారు ఫారెస్ట్ న్యూస్ ఎడిటర్ కొంగరాజా గారు.

"యస్" అన్నారు జర్నలిస్ట్ కాకామణి.

పదిహేను రోజుల తరువాత మరో న్యూసు. ముక్కు పచ్చలారని ఓ ఆవు దూడని 'కర్రిపట్టు' అనే ఓ ఎద్దు బలాత్కారంగా చెరిచిందనీ, ఆ ఘోరం తట్టుకోలేక ఆవుదూడ చనిపోయిందనీ .

"ఆ దౌర్భాగ్యపు జనారణ్యం లోనే కాదు మన అరణ్యంలోనూ స్త్రీ జాతి పైన దౌర్జన్యాలు పెరిగాయి. ఎక్కడ చూసినా బలాత్కారాలు, హత్యలు, అత్యాచారాలు. ఏమైనా ఈ పరిస్థితిని ఎదిరించాలి. భవిష్యత్ తరాల్నికాపాడాలి" .

అడవి దద్దరిల్లేలాగా గాండ్రించింది 'సూక్తిమతి' అనే పేరున్న సివంగి. అది ఈ మధ్యనే అడవిలో హంగామా మొదలుపెట్టింది. రోజుకి పది సభలైనా పెట్టి, ఫెమినిజం గురించీ, ఫెమినిష్టు వాదపు సౌలభ్యాన్ని గురించీ పశుజాతికి విశదంగా బోధిస్తోంది.

"మనకేమిటి లాభం?" శుక్తిమతి చెవిలో గుసగుసగా అంది రగడమతి. ఈవిడ ఊసరవెల్లి జాతికి చెందినది. క్షణానికో రంగు మారుస్తుంది. సూక్తి మతి కంటే సీనియర్. మొగుడితో గొడవ పడి విడాకులు తీసుకుని, అలా విడాకులు తీసుకుని స్వేచ్ఛగా ఉండగలగడమే స్త్రీ జాతికి నిజమైన విముక్తి, ముక్తి అని ఉపన్యాసాలు చెబుతుంది. అంతే కాదు అనేకానేక అడవి పక్షి జంతు దంపతుల్ని దిగ్విజయంగా విడగొట్టిన ఘనత రగడమతిది.

"నువ్వు నన్ను అడగడం ఏమిటీ చోద్యం కాకపోతే? రగడ మతి బుగ్గని సున్నితంగా పొడిచింది సూక్తిమతి." ఇద్దరికీ తెలుసు జంతు ప్రతినిధులుగా జంతు మహా సభలో అడుగు పెట్టాలంటే ఇలాంటి ఎన్నో పోరాటాలు సాగించినట్లు ఋజువు లుండాలని అప్పుడే ఏలిన వారి కళ్లబడతామనీ.

సూక్తిమతీ, రగడమతీ మరియూ బోలెడు మంది జంతు స్త్రీ ఆడజాతి వారూ, గొప్ప ఊరేగింపుగా వెళ్లి వజ్రకాయుడికి మావోజార్లు సమర్పించాయారు. దండకారణ్యంలో ఆడ జాతికి అసలు రక్షణ లేదనీ ఇలా అయితే ఆడజాతే నశిస్తుందని అలా ఆడజాతి నశించిన మరుక్షణమే ఈ భూలోకం మీద యావత్ జంతు జాలమూ అంతరించి పోతుందనీ సవివరంగా వివరించారు. ప్రభుత్వం తమగోడు పట్టించుకోకపోతే ఏ త్యాగానికైనా వెనుదీయమని హెచ్చరించారు కూడా .

వజ్రకాయుడు చాలా అనునయంగా మాట్లాడడమే గాక సూక్తి మతికీ ఆడజంతు రక్షణ సమితికి అధ్యక్షురాలిగా అప్పటికప్పుడు నియమించాడు. రగడమతిని కార్యదర్శి గాను మరో 'గోమతి' అనే పేరు గల ఆవుని ప్రత్యేక కార్యదర్శి గాను నియమించి వారికి కావలసిన 'సకల సౌకర్యాలు' అమర్చమని వక్రబుద్ధికి ఆజ్ఞ ఇచ్చాడు. సకల సౌకర్యాలూ తక్షణమే కూర్చబడ్డాయి.

"ఆ తరువాత ఏమైంది?" అడిగాడు దూరదృష్టి.

ఈ దూరదృష్టి సమదృష్టికి మనవడు. ఏకదృష్టికి కొడుకు. 'కాక' జాతి వాడు.

"ఏమవుతుందీ వజ్రకాయుడి ఆజ్ఞ మేరకు సూక్తి మతికీ, రగడ మతికీ కావాల్సిన హంగులూ, ఆహార పదార్థాలూ, విలాసాలూ క్షణాల్లో సమకూరడంతో వారు శాంతించడమే కాక, దండకారణ్యంలో న్యాయం నాలుగు పాదాలమీదా నడుస్తోందని ప్రజలకి చెప్పడమే కాక పత్రికల్లోనూ ప్రకటించారు. 'గోమతి' మాత్రం తలొంచుకుని మేత కోసం అడివికి పోయింది" నవ్వాడు (నవ్వింది ) సమదృష్టి .

"మరి రేపులూ, అత్యాచారాలూ ఆగిపోయాయా?"

"ఆహా, ఎందుకు ఆగిపోవూ?

అటువంటి వార్తలు పత్రిక ల్లోనూ, ఛానల్లలోనూ ప్రదర్శింప బడటమూ ప్రచురించబడటమూ ఆగిపోయా-యి. అంటే ప్రభుత్వం ఆపేసింది. ప్రస్తుతం జంటకో రేపూ, పూటకో మర్డరూగా 'మనుజ న్యాయం' అడవిని ఏలుతోంది. సూక్తి మతి ప్రస్తుతం ప్రభుత్వం లోని ఓ ముఖ్య శాఖకి అధిపతియై, వజ్రకాయుడి కనుసన్నల్లో మెలుగుతోంది . "సమస్త జంతు సుఖినో భవంతు" అన్నాడు ఏకదృష్టి .... దీర్ఘంగా నిట్టూర్చి.

మళ్ళీ కలుద్దాం,

భువనచంద్ర.

# పూరీ జగన్నాథస్వామి వైభవం

(10 వ పేజీ తరువాయి)

**అనుగ్రహించడానికి స్వామి భూలోకంలో అవతరిస్తాడు. స్వామి భక్తికి వశుడు. విష్ణు భక్తి ధర్మార్థ కామ మోక్షాలకి మూలం. ఆయనేఅనేకరూపాలలో కనబడుతున్నారు. దేవతలుకూడా విష్ణు భక్తి కలిగి ఉంటారు.**

**" ఓ రాజా1 నీవు వైష్ణవ భక్తుడవు. బ్రహ్మకు ఐదవ తరం వాడివి. అష్టాదశ విద్యలు నేర్చుకున్న వాడివి. బ్రాహ్మణులను పూజిస్తావు. కనుక ఆ స్వామిని నీవు కన్నులతో చూస్తావు. బ్రహ్మ నీకు సాయం చేస్తాడు. పురుషోత్తమ క్షేత్రానికి చేరుకున్నాక అన్ని నీకు వివరంగా చెబుతాను. ఇప్పటికే మూడు జాములయింది. అందరు విశ్రాంతి తీసుకోండి" అని నారదుడు ఇంద్రద్యుమ్నునికి చెప్పాడు. ( 98 - 151 )**

**స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండం లోని పురుషోత్తమ క్షేత్ర వైభవంలోని జైమిని-ఋషి సంవాదము అను పదకొండవ అధ్యాయం సమాప్తం.**

(ఇంకా వుంది)

# కరోనా పై వీడియో కథ



పమ్మి భారతీ శర్మ



# శ్రీసూక్తం

పాలకుర్తి రామమూర్తి

ఆమె ఏనుగుల ఘీంకారము చేత మేలుకుంటున్నది, అంటున్నది శ్రీ సూక్తం. అనగా ఆమె నిద్రపోతుందనా? కాదు... చైతన్యానికి చేతన కలుగుతుంది లేదా జాగృతమవుతున్నది. జాగృతమవడం సహజ స్థితికి చేరుకోవడం. ఏనుగు శుభాలకు ఐశ్వర్యానికి ప్రతీక. ఏనుగులు అభ్యుదయానికి చిహ్నాలు. మన అవసరానికన్నా మన వద్ద ఎక్కువగా ఉన్నది అనే భావనయే అభ్యుదయం.

ధనధాన్యాలకు గోవులూ, శక్తి సామర్ధ్యాలకు అశ్వాలు, స్థాయిని పెంచుకునేందుకు పరివారమూ ప్రతీకలుగా చెపుతారు. ధనధాన్యాదులు పెంచుకోవడం వల్ల ఇతరుల అవసరాలను తీర్చగలుగుతాము. శక్తి సామర్ధ్యాలను పెంచుకోవడం వల్ల సమున్నత లక్ష్యాలను సాధించ గలుగుతాము. పరివారము పెరగడం వల్ల స్థాయి పెరుగుతుంది. అంతే కాక, గోవులు వాక్కులు, ఆశ్వములు ప్రాణశక్తులు కాగా పరివారము శమదమాదులుగా చెపుతారు. ఇవి సాధకుని ఆధీనంలో ఉన్నంత కాలం తన ప్రస్థానం ఉన్నత పథంలో సాగుతుంది.


కా ం సో ఽ స్మి తా ం హిరణ్యప్రాకారామార్ద్రాం జ్వలంతీ తృప్తాం తర్పయంతీం పద్మే స్థితాం పద్మవర్ణాం తామిహోపహ్వాయే శ్రియం!

చంద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం శ్రియం లోకే దేవజుష్టాముదారాం తాం పద్మినీం



శరణమహం ప్రపద్యే-అలక్ష్మీర్మే నశ్యతాం త్వాం వృణే!

అగ్నికన్నా తేజస్వం తమైనది, చంద్రుని వెన్నెలకన్నా మృదువైనది, లాలిత్యమైనది, ఆర్ద్రతయే తన స్వభావమైనది, ఆనందమే తన స్వరూపమైనది, ఆనందాన్ని ఆశ్రితులకు పంచి ఇచ్చునది, పద్మ వర్ణములు గలిగినది, పద్మములో వసించునది యైన మూర్తి ఎవరో (అప్పటి వరకు సాధకుని యెఱుకలో లేనిది) ఆమె నా యెదుట సాక్షాత్కరించు గాక, అని సాధకుడు, ప్రార్థిస్తున్నాడు. లక్ష్యాన్ని దర్శించలేని వాడు లక్ష్యాన్ని ఛేదించలేడు. సాక్షాత్కారము అంటే Realisation. సాధించాలనుకున్న లక్ష్యం తేజస్వంతమై ఉండాలి. ఆలోచనలో ఆర్ద్రత ఉండాలి. మాటలో మృదుత్వము ఉండాలి. లక్ష్య సాధన తృప్తినివ్వాలి, తృప్తి (Contentment) మరొక ఉన్నత లక్ష్యాన్ని చూపాలి. అది ఆనందాన్ని ఇవ్వాలి. ఆనందాన్ని ఇవ్వాలి అంటే ఆమెలో ఆనందం ఉండాలి. అందుకే ఆమెను ఆనంద స్వరూపిణి అంటారు. అంతే కాదు, లక్ష్మి సాగరంలో పుట్టింది. పుట్టడం అంటే ఆవిర్భవించడం లేదా కనుగొనబడడం. పద్మము నీటినుండి వస్తుంది. అంటే సృష్టికి ఆరంభమైనది, నీరు. నీటిలో ముందుగా ఉద్భవించినది పద్మము కాగా



తదుపరి పుట్టినది భూమి. వాసయోగ్యమైనది భూమి. కర్మ యోగ్యమైనది భూమి. సకల సృష్టికి ఆధారమైనదీ భూమి మరియు నీరే. ఈ రెండూ ఆ అమ్మయే. సంకల్పం, ఆలోచన, ప్రణాళిక, ఆచరణ వీటికి ప్రతీకలే పద్మములు, భూమి. పద్మానికి వికసన సహజం. వికసన తేజస్సును సంతరించుకుంటుంది. తేజస్సు వ్యాప్తి చెందుతుంది. వ్యాప్తి చెందేది గమిస్తుంది. గమనం లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

సో-అస్మి... "సః అహం అస్మి" మాటలతో నిర్వచించలేని అపరిమితమైన పరబ్రహ్మ తత్త్వమే నేను అయి ఉన్నాను. అంటే నాలో ఆ తత్త్వం ఉంది అనే "సత్యా"న్ని గుర్తించడం. అంటే ఆ తల్లి తత్త్వాన్ని గుర్తించే జ్ఞానాన్ని హృదయంలో జ్వలింప చేయమని జాతవేదుడిని ప్రార్థిస్తున్నాడు, సాధకుడు.

క్షీర సాగరంలో ఆమెతో పాటుగా షోడశ కళాప్రపూర్ణుడైన చంద్రుడూ పుట్టాడు. అలాగే సాగరంలో జ్యేష్టాదేవి లాంటి నకారాత్మక శక్తులూ ఉద్భవించాయి. వ్యక్తి దేనిని ఆరాధిస్తాడో ఆవిధంగా మారుతాడు. ఒక నాణానికి రెండు పార్శ్వాలు ఉన్నట్లుగానే మంచి చెడులూ రెండూ ప్రపంచంలో ఉన్నాయి. మంచిని సమాదరిస్తే ఉన్నతి లభిస్తుంది చెడును సమాదరిస్తే పతనావస్థకు చేరుతాము. మనలో ఒక అపోహ ఉంది... మంచిని పెంచితే చెడు నశిస్తుందని. అది సత్యం కాదు. మంచిని ఎంతగా పెంచుతామో చెడూ అంతగా దానిని అనుసరించి వస్తూ అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఏ ప్రలోభానికైనా సాధకుడు లొంగితే ఆ సమయాన్ని ఉపయోగించుకొని చెడు ఉత్తేజితమౌతుంది. అందుకని సాధకుడు అప్రమత్తంగా ఉండాలి. ఆ నేపథ్యంలోనే కామక్రోధాలకు, రాగద్వేషాలకు తనను దూరంగా ఉంచమని ప్రార్థిస్తున్నాడు.

జ్వ ల ం తీ ం అంటున్నారిక్కడ. అమ్మ తపస్సు చేసే వారిని జ్వలింప చేస్తుంది. జ్వలన వల్ల ప్రకాశం కలుగుతుంది. ప్రకాశం ప్రసరణ శీలత గలిగినది. ప్రసరణ వికసన నిస్తుంది. వికసన విస్తరణకు ప్రతీక. విస్తరణ వల్ల సత్యం అవగత మౌతుంది. సత్య శోధన

భౌతిక జీవన పరిమితులను అవగాహన చేసుకునేందుకు, ఆత్మ మూలాలను తెలుసుకునేందుకు దారి చూపుతుంది. నిజానికి తపస్సు అంటే అనుసరణ, అనుకరణ. ఆవిష్కరణకై చేసే అన్వేషణలో, నిశ్చిత మనస్కులై ముందుకు సాగే క్రమంలో తెలుసుకోవాలనే తపన, ఉత్సాహం, ఆరాటం, ఆవేదన, సంవేదన, శ్రద్ధ, పట్టుదల, నిష్ట, నియమ జీవనం, దీక్షాదక్షతాపూర్ణ కార్యాచరణ, ప్రణాళికాబద్ధ ప్రయత్నశీలత... ఎక్కడైతే ఉంటాయో అక్కడ తపస్సు ఉంటుంది. ఆ తపస్సు తీవ్రమైతే అది జ్వలిస్తుంది. ఆ జ్వలన కార్యావిష్కరణకు నాంది పలుకుతుంది. జ్వలిత తపోసాధన నిర్భయతను ఇస్తుంది. అయితే లక్ష్మీదేవి ఎందుకు జ్వలింప చేయాలి? అనేది ప్రశ్న. ఆది, అంతము లేని జ్ఞానార్జనలో నిరంతర ప్రయాణమే జ్వలన. కాబట్టి "యెఱుక" అనే ప్రక్రియ నిరంతరం సాగిపోవాలి. దానికి జ్వల్వన కావాలి కాబట్టి అమ్మ జ్వలింప చేస్తుంది. మూలాధార చక్రంలో కుండలినీశక్తి జాగృతమయి అక్కడి నుండి స్వాధిష్టానం నుండి మణిపూరకం వరకు చేరుకుంటుంది. అంటే మూలాధారంలో పృథ్వీ తత్త్వం, స్వాధిష్టానంలో వాయుతత్త్వం లయంకాగా మణిపూరకంలో అగ్ని తత్త్వం జ్వలిస్తుంది.



అలాగే అనాహతం, విశుద్ధం, ఆజ్ఞా, సహస్రారం వరకు ఆ ప్రయాణం సాగుతుంది. అవి వరుసగా వాయురాకాశ జీవాత్మ పరమాత్మలుగా చెపుతారు.

తల్లి స్పర్శ ద్వారా పిల్లవానిలో అనుబంధాన్ని, ప్రేమను, ఆప్యాయతను నింపుతుంది. దానిని నిరంతరం పిల్లవానికి అందించడమే ఆ లక్షణాలను జ్వలింప చేయడం. తల్లి మనస్సు ఆర్ద్రమైనది. కాబట్టి అమ్మ ఆర్ద్రతాపూర్ణ వీక్షణాలతో జ్వలింప చేస్తుంది. ఇక్కడ జ్వలన అగ్ని జ్వలన కాదు. తాను తృప్తయై, ఆ తృప్త మనో భావనలను ప్రపంచానికి పంచుతూ, ఆర్తుల మనో నిశ్చలతను జ్వలింప చేస్తుంది. నిజానికి ఏది పొందితే మరొకటి పొందవలసిన అవసరం ఉండదో మరేదానిని కోరాలని భావించమో దానిని తృప్తి అంటారు.

తృప్తి అంటే ఆగిపోవడం కాదు. సాధించడం ఒక సంఘటన లేదా పరిణామము. నిరంతరం సాధిస్తూనే ఉండడం ఒక ఉత్సవం. పరిణామం నుండి ఉత్సవం దాకా సాగడం చలన శీలత. తృప్తి స్తబ్దతను ప్రసాదిస్తే అక్కడే ప్రయాణం ఆగిపోతుంది. తృప్తి ప్రేరణగా పనిచేస్తే పరిణామం ఉత్సవంగా మారుతుంది. అందుకే తృప్తాం అనడం వల్ల ఒక లక్ష్యం నుండి మరొక సమున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవడమే సాధకుని కర్తవ్యంగా చెప్పుకోవాలి. "జ్వలంతీం తృప్తాం" అనడం వల్ల ఆ కోరికను లేదా ఆశయాన్ని నిరంతర విజయ మార్గంగా చెప్పడం జరుగుతుంది.


జ్వలన లేని తృప్తిని పొందితే ఏమవుతుంది? హిరణ్యకశ్యపుడు తపస్సు చేసాడు. ఆ తపో వహ్ని జ్వాలలు ముల్లోకాలలో వ్యాపించాయి. బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. వరం కోరుకోమన్నాడు. బ్రహ్మ ప్రత్యక్షమవడం వరం కోరుకోమనడం వల్ల తనలో తపోజ్వలన ఆగిపోయింది. భౌతికజీవన లాలసత ప్రలోభంగా మారింది. తనలో అన్వేషణా భావన నిలిచిపోయింది. తృప్తి నిండిపోయింది. దానితో తానున్న స్థితి జారిపోతుందేమో అన్న భయం తనలో పాదుకున్నది. ఆ భయాధీన మనస్సు అస్తవ్యస్తంగా వరాలను కోరింది.

(ఇంకా వుంది)

# తొమ్మిదవ రాష్ట్రపతి
# శంకర్ దయాళ్ శర్మ



పాలెపు బుచ్చిరాజు




శంకర్ దయాళ్ శర్మ 1918వ సంవత్సరం ఆగష్టు నెల 19వ తేదీన మధ్య ప్రదేశ్ రాజధాని భోపాల్ లో పుట్టాడు. తండ్రి ఖుషీలాల్ శర్మ. తల్లి పేరు సుభద్రాదేవి. తండ్రి ఖుషీలాల్ శర్మ పేరుపొందిన ఆయుర్వేద వైద్యుడు. నగరపు నడిబొడ్డులో వారికి పెద్ద హవేలీ ఉండేది. దానిలో సగభాగం ఆయుర్వేద చికిత్సాలయంగా ఉపయోగించేవారు. ఖుషీలాల్ శర్మ గొప్ప ఈశ్వర భక్తుడు. అందువల్లనే ఆయన తన జ్యేష్ట పుత్రుడికి శంకర్ దయాళ్ అని పేరు పెట్టుకున్నాడు. ఆ పిల్లవాడు పెరిగి పెద్దవాడై పెద్ద చదువులు చదివి చాలా గొప్పవాడు కావాలని ఆయన కోరిక. ఆ పరమేశ్వరుడు ఆయనకంతటి భాగ్యం కలగజేయాలని మొక్కుకునేవాడు. అంతేకాక అయన జాతకం చూసిన జ్యోతిష్కులు కూడా ఆ పిల్లవాడు భవిష్యత్తులో గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించి, దేశానికి మేలు చేసే కార్యాలనెన్నిటినో నిర్వహిస్తాడని చెప్పారు. ఆ నాటి పరిస్థితుల్ని బట్టి అందరికీ అది ఊహకందని విషయంగా అనిపించింది. దేశంలో ఆంగ్లేయులు రాజ్యం చేస్తున్నారు. భారత దేశం ఒక బానిస దేశంగా పరిగణించబడుతోంది. ఆ నేపథ్యంలో భారత దేశం ఇంతలో స్వాతంత్ర్యాన్ని సాధించగలుగుతుందని, సర్వతంత్ర స్వతంత్ర దేశంగా మారి ప్రజాప్రభుత్వం ఏర్పడుతుందని, ఆ దేశానికి తన కుమారుడు ఒకనాడు రాష్ట్రపతిగా ఎన్నిక అవుతాడని ఆ తండ్రి కలలో కూడా ఊహించలేదు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి, మహాత్మా గాంధీజీ అహింసాయుత ఆందోళన చేప-

ట్టక పూర్వపు రోజులవి.

శంకర్ దయాళ్ శర్మ ప్రారంభ విద్య భోపాల్ లోనే 'రామకృష్ణ పాఠశాల'లో జరిగింది. రతన్ లాల్ ఆయనకి సన్నిహిత మిత్రుడు.

చిన్నప్పటి నుంచి శంకర్ దయాళ్ చదువులో చాలా చురుకైన వాడు. బాగా చదువుకోవాలనీ, ఆటపాటల్లో తానే ముందు ఉండాలనీ ఎప్పుడూ కోరుకునేవాడు. పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం ఆయనకి నచ్చేది కాదు. తన కంటే ఒక్క మార్కు కూడా క్లాసులో ఎవరికైనా ఎక్కువ వస్తే సహించేవాడు కాదు. ప్రతీ పరీక్షలోను తానే ప్రథముడిగా వచ్చేవాడు. ఆఖరికి ఇంటర్ పబ్లిక్ పరీక్షలో కూడా ప్రథమ స్థానం తనదేననే నమ్మకంతో ఉన్నాడు. ఫలితాలు వచ్చిన రోజున పేపర్లో చూడడానికి రతన్ లాల్ తో కలిసి రైల్వే స్టేషనుకి వెళ్ళాడు. ఫస్ట్ రేంకు తనదేననే ధైర్యంతో పేజీ తిప్పాడు. కాని దురదృష్ట వశాత్తూ ఆయనకి రెండవ రేంకు వచ్చింది. అంతే! మిన్నుముట్టిన కోపంతో పేపరు రోడ్డుమీద విసిరేసి ఇంటిదారి పట్టాడు. ఓటమిని ఒకంతట అంగీకరించే మనస్తత్వం కాదు ఆయనది. తరవాతి కాలంలో ఆయన ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆగ్రా, అలహాబాదు, లక్నో, పట్టణాలకి వెళ్లి చదివినప్పుడు, అన్నిటిలోనూ ప్రథమ స్థానంలోనే వచ్చాడు. ఆఖరికి ఈత కొట్టడంలో కూడా ప్రథమ స్థానాన్నే అలంకరించేవాడు. ఆయనలో అంత బలవత్తరమైన పట్టుదల, కార్య నిర్వహణా దీక్ష ఉండేవి. భోపాల్ లో ఉండే రోజుల్లో ఆయన తండ్రి తో కలిసి వెళ్లి, నదిలో ఈత కొట్టడం నేర్చుకున్నాడు. తండ్రి దగ్గర ఈతలోని మెళకువలు నేర్చుకుని, మంచి ప్రావీణ్యం సంపాదించి, నది ఆవలి ఒడ్డునుంచి ఈవలి ఒడ్డుకి అనాయాసంగా ఈత కొట్టేసేవాడు. అది భోపాల్ లో ఒక చర్చనీయాంశం అయింది కూడా.



భోపాల్ లో ఇంటర్ పాసయ్యాక బి.ఏ. చదవడానికి శర్మ ఆగ్రా సెంట్ జాన్స్ కాలేజిలో జాయిను అయ్యాడు. అక్కడ రతన్ కుమార్., ఆలిం అనే మరొక భోపాల్ మిత్రుడు శర్మ ముగ్గురూ హాస్టల్ లో ఒకే గదిలో ఉండేవారు. శంకర్ దయాళ్ శర్మ కొంత భావుకుడు కూడా కావడంతో, అప్పటికే కవిత్వం రాసే అలవాటు అయింది. దేశభక్తి మీద కవితలు రాసేవాడు.

ఓ సిపాయీ!
నీ ఆశయాలనీ, నీ త్యాగాలనీ
త్రాసులో వేసి తూచుకుని
నీ బలాన్ని తెలుసుకోవోయీ!

అంటూ ఆయన రాసిన ఒక గేయం విద్యార్థిలోకంలో అత్యధికంగా ప్రచారం పొందింది.

శంకర్ దయాళ్ శర్మ తండ్రి ఖుషీలాల్ అంత సంపాదన పరుడేమీ కాదు. నిజానికి పిల్లల్ని పొరుగూరికి పెద్ద చదువుల కోసం పంపి చదివించగల శక్తి లేదు. కాని, శంకర్ ప్రతి క్లాసులోనూ, తన ప్రతిభతో రాణిస్తూ, ఉండడం వల్ల ఎన్నో ఉపకార వేతనాలు లభిస్తూ ఉండేవి. ఈ ధనం వేడి నీళ్ళకి చన్నీళ్ళు తోడు అన్నట్టుగా సరిపోయేది కాబట్టి, చదువు మాత్రం నిరాటంకంగా సాగిపోయేది. ఆయనకి హిందీ భాష మీదా, సంస్కృతంలోనూ మంచి పట్టు ఉండేది. దానికి కారణం,

చిన్నతనంలో తల్లి ఇచ్చిన శిక్షణ. రామాయణ, భారత, భాగవతాలు, అమర కోశం ఆయన తల్లి చరణాల దగ్గర నేర్చుకున్నాడు.

బి. ఏ. తరవాత ఆయన న్యాయ శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లక్నోయూనివర్సిటిలో చదివాడు. పి హెచ్ డి చేయడానికి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి వెళ్ళాడు.

ఆయన ఆగ్రాలో డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే తల్లి సుభద్రాదేవి మరణించింది. తల్లి మరణం శర్మ హృదయంలో చెరగని గాయం చేసింది. ఒకంతట మనసుని సమాధాన పరచుకోలేకపోయాడు. ఆఖరికి మస్తాపంతో జబ్బు పడ్డాడు కూడా. తండ్రి, కుటుంబ సభ్యులు ఎంతగానో నచ్చజెప్పాక తనను తాను సంబాళించుకున్నాడు. ఇంటికి మూలస్తంభమైన ఇల్లాలు పోవడంతో, పిల్లల బాగోగులు చూసుకోవడానికి, ఇంటిపనులు చేసుకోవడానికి కష్టం అయి, ఖుషీలాల్ దివంగత భార్య చెల్లెలినే రెండవ వివాహం చేసుకున్నాడు. ఆమె పేరు సంపత్ బాయి. ఆమె చాలా సాదుస్వభావురాలు. ముందునుంచీ అక్కగారింటికి వస్తూపోతూ ఉండేది కాబట్టి ఆమెకు ఆ కుటుంబం క్రొత్తగా అనిపించలేదు. శంకర్ దయాళ్ అంటే ఆమె ప్రాణం పెట్టేది. ఇంట్లో పెద్దవాడిని పేరుపెట్టి పిలవరాదు కాబట్టి ఆమె శకర్ ను 'భయ్యా' అని సంభోదించేది.




శర్మ కూడా ఆమెను 'చాచీ' అని పిలిచేవాడు. అది ఆ ఇంట్లో ఎంత అలవాటు అయిందంటే, పని మనిషి, పాలవాడు, పోస్టు మేన్, ఆఖరికి సంపత్ బాయి కి పుట్టిన పిల్లలు కూడా ఆమెను చాచీ అనే పిలిచేవారు.

చదువులో శంకర్ దయాళ్ అతి మేధావంతుడు. ఏ విషయాన్నైనా కూలంకషంగా అధ్యయనం చేసేవాడు. ఏదో ఉబుసు పోకకు చదవడం సమయాన్ని వృథా చేయడం అని అయన భావన. ఆయనలోని ఈ అసాధారణ ప్రతిభ వల్ల నే జీవితంలో అత్యుత్తమ స్థానాలకి ఎదగ గలిగాడు.

లక్నో యూనివర్సిటీలో చదువు పూర్తి అయి డాక్టరేట్ కి కేంబ్రిడ్జి వెళ్ళడానికి ప్రయత్నాలు ప్రారంభించినప్పుడు డబ్బు ఒక పెద్ద సమస్యగా తయారయ్యింది. తండ్రికి అంత ధనం ఖర్చు చేసి ఆయన్ని విదేశాలకి పంపగల స్తోమత లేదు. ఏమైనా వెళ్ళి తీరాల్సిందేనని, శంకర్ దయాళ్ పట్టుపట్టుకుని కూర్చున్నాడు. అప్పుడు సవతి తల్లి సంపత్ బాయి ముందుకు వచ్చి, తన దగ్గర ఉన్న వెండి, బంగారం నగలన్నీ అమ్మేసి, ప్రయాణానికి కావలసిన డబ్బు సమకూర్చింది. పిల్లల భవిష్యత్తుకి అడ్డురాకూడదని ఆమె అభిప్రాయం. ఆమె చేసిన ఈ త్యాగాన్ని శంకర్ దయాళ్ ఎప్పుడూ మరిచిపోలేదు.

అలా కేంబ్రిడ్జిలో డాక్టరేట్ పూర్తిచేసి, అక్కడే న్యాయశాస్త్ర అధ్యాపకుడిగా పని చేశాడు. కొంతకాలం హార్వర్డ్ విశ్వవిద్యాలయం, అమెరికాలో కూడా 'ఫెలో' గా ఉన్నాడు.

స్వదేశానికి తిరిగి వచ్చాక ఆయనని లక్నో యూనివర్సిటీ ప్రొఫెసర్ గా ఆహ్వానించింది. అప్పుడు భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తరోజులు. ఒక ప్రక్క ఉద్యోగం చేస్తూనే, దేశ రాజకీయాల్లో శ్రద్ధ వహించసాగాడు. ఉద్యోగం చేసేది లక్నోలో. కాని రాజకీయావసరాల కోసం ప్రతి నిత్యం భోపాల్ రావలసి వచ్చేది. ఆ రోజుల్లో ఆచార్య నరేంద్ర దేవ్ అనే ఆయన గొప్ప విద్యావేత్త. రాజనీతిజ్ఞుడు. బాగా పలుకుబడి ఉన్నవాడు. ఆయన చేసిన బోధలవల్ల ప్రభావితుడై శంకర్ దయాళ్ శర్మ ఎక్కువ కాలం రాజకీయాల్లో గడపసాగాడు. కాని, లక్నో ఉద్యోగం, భోపాల్ రాజకీయం లంకమేత, గోదావరి ఈతలా ఉండేది. ప్రొఫెసర్ గా ఉంటూ అధికంగా సెలవులు పెట్టడం కష్ట సాధ్యం అయేది. అప్పుడు ఆచార్య నరేంద్ర దేవ్ ఆయనకి అవసరం అయినప్పుడు సెలవులు మంజూరు అయ్యేలా చేసేవాడు.




శంకర్ దయాళ్ శర్మ రాజకీయ ప్రవేశం చేసేనాటికి, 1948లో, దేశానికి స్వాతంత్ర్యం అయితే వచ్చింది కాని, కొన్ని జాగీర్ దారులు, నవాబుల ఆధీనంలో ఉన్న స్వతంత్ర రాజ్యాలు దేశంలో విలీనం కావడానికి ఇష్టపడక, స్వతంత్రంగా ఉంటామని పట్టుబట్టాయి. శంకర దయాళ్ స్వంత రాష్ట్రం భోపాల్ కూడా వాటిలో ఒకటి. కాని అప్పటి హోమ్ మినిస్టరు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిన్న చిన్న రాజ్యాలన్నీ భారత దేశంలో విలీనం కావలసిందేనని పట్టుపట్టి ఉద్యమం లేవదీశాడు. ఆ సమయంలో భోపాల్ భారత దేశంలో భాగం కావడానికి యువనేతగా శంకర్ దయాళ్ శర్మ అగ్రస్థానంలో నిలిచి పోరాడాడు. దానితో రాజకీయాల్లో ఆయన ప్రఖ్యాతి చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆ పోరాటంలో భోపాల్ జాగీర్ దారు ప్రజా ఉద్యమానికి తలవంచక తప్పలేదు. ఆఖరికి 1949వ సంవత్సరం జూన్ నెల 1వ తేదీన భోపాల్ కూడా అఖండ భారతంలో ఒకటయ్యింది. రాజకీయంగా శంకర్ దయాళ్ శర్మకి ఇది ఒక ఘన విజయం.

దేశం కోసం ఇంత కృషి చేస్తూ కూడా ఆయన తన బోధనా వ్యాసంగాన్ని వదిలిపెట్ట లేదు. సుమారు రెండున్నర సంవత్సరాలు లక్నో విశ్వ విద్యాలయంలో రీడర్ గా పని చేశాడు. తరువాతి రోజుల్లో కాంగ్రెసు పార్టీ, 1951వ సంవత్సరంలో ఆయన్ని భోపాల్ కాంగ్రెసు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి ఆయన్ని అలంకరించింది.

ఇంకా రాష్ట్రంలోను, కేంద్రంలోనూ మంత్రిగా ఎన్నో పదవుల్ని పోషించి దేశం పట్ల తన భక్తిని చాటుకున్నాడు. ఆ రోజుల్లో కాంగ్రెసు పార్టీలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చాయి. కాని ఆయన పార్టీని ఎన్నడూ విడిచిపెట్టలేదు. ఆయన నియమ నిష్టలని, నిజాయితీని, బాధ్యతల పట్ల అంకిత భావాన్ని త్యాగ శీలతని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహా నాయకులు ఎంతో మెచ్చుకునేవారు.

అందుకే ఆయన ఆంధ్ర ప్రదేశ్ కి గవర్నరుగాను, ఉప రాష్ట్రపతిగాను, రాష్ట్రపతిగాను కూడా ఎన్నిక కాగలిగాడు. 'పట్టు పట్టరాదు. పట్టి విడువరాదు' అన్న సామెతకి శంకర్ దయాళ్ శర్మ ఒక ఉదాహరణ.

# కరోనా విషాణువు-19 (కథ వెనుక కథ)




## వేమూరి వేంకటేశ్వరరావు

మనిషై పుట్టిన తరువాత తప్పులు చెయ్యడం సహజం. చేసిన తప్పుని తెలుసుకుని సరిదిద్దుకోవడం విజ్ఞుల లక్షణం. తిరిగి అటువంటి తప్పు జరగకుండా జాగ్రత్త పడడం మన కనీస ధర్మం.

ఉదాహరణకి విమానపు ప్రమాదాల సంగతే చూద్దాం. ప్రతి ఏటా కారు ప్రమాదాలలో రోడ్ల మీద చనిపోయేవారి సంఖ్యతో పోల్చి చూస్తే విమాన ప్రమాదాలలో చనిపోయేవారి సంఖ్య అత్యల్పం. కానీ ప్రపంచంలో ఏ మూల విమానం కూలిపోయినా అది పతాక శీర్షిక అయి కూర్చుంటుంది. ఇటువంటి బహుళ ప్రచారం వల్ల ఒక లాభం ఉంది. విమానం పడిపోయినప్పుడల్లా, “అది ఎందుకు పడిపోయింది? ఏ కారణం లేకుండా విమానం కూలి పోడానికి వీలులేదు కదా” అన్న దృక్పథంతో విచారణ జరుగుతుంది. తప్పు ఎవరిది? విమానం కట్టడిలో దోషం ఉందా? విమానాన్ని నడిపిన చోదకుడు తప్పు చేసేడా? లేక, విపరీత వాతావరణం కారణమా? లేక, .... ఇలా తర్కించి తప్పెక్కడుందో నిర్ధారించే వరకు మన వ్యవస్థ ఊరుకోదు. అందువల్లనే విమానాలు ఎంతో సురక్షితమైన ప్రయాణ సాధనాలుగా తయారయేయి.

ఇప్పుడు విమాన ప్రమాదాలని మించిన బహుపెద్ద ఆపద మనకి ఎదురైంది. అదే కరోనా వైరస్ తీసుకొచ్చిన మహమ్మారి. దీనితో పోల్చ దగ్గ ప్రాణాంతకమైన రోగాలు లేకపోలేదు. కానీ దీనికి వచ్చిన ప్రచారం, దీని మీద మనం పెడుతున్న సావధానత కేన్సరు వంటి భయంకరమైన రోగాలకి రాలేదు. ఎందువల్ల? మొట్టమొదటగా, ఇది సరికొత్త జాడ్యం. ఇది మనని ఎలా చంపుతుందో మనకి ఇంకా పరిపూర్ణంగా అర్థం కాలేదు. పైగా ఈ అంటురోగం అంటుకోడానికి రోగిని అంటుకోనక్కరలేదు; రోగి దరిదాపులకు వెళితే అంటుకుంటుంది. పోనీ రోగికి ఆమడ దూరంలో ఉందామా అంటే రోగులందరిలో రోగలక్షణాలు స్పుటంగా బయటకి కనబడడం లేదు. కనుక అందరికీ దూరంగా ఉండాలి. ఇది సోకిన తరువాత దీనిని ఎదుర్కొని కుదర్చటానికి మన దగ్గర ప్రస్తుతానికి మందు లేదు. ఇది సోకకుండా ఆపడానికి మన దగ్గర టీకా మందు లేదు. అటువంటి టీకా మందు తయారు చెయ్యడానికి కనీసం ఒక ఏడు వ్యవధి కావాలి. ఈ లోగా వేల మీద మనుష్యులు చచ్చిపోవడం ఒక



ఎత్తు అయితే, మన ఆర్థిక వ్యవస్థ పూర్తిగా గల్లంతు అయిపోవడం మరొక ఎత్తు. ఈ వైరస్ బారి నుండి బతికి బయటపడ్డ వాళ్ళు బట్టకట్టి బ్రతుకు తెరువు చూసుకోడానికి కూడా అవకాశాలు లేకుండా పోయే ప్రమాదం ఉందనడం అతిశయోక్తి కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఇంత జన నష్టం, ధన నష్టం జరుగుతూ ఉంటే ఈ మహమ్మారి ఇలా విరుచుకు పడడానికి కారణాలు ఏవేమిటో అన్వేషించడం మన కనీస ధర్మం.

ఈ కరోనా విషాణువు ఎక్కడ, ఎప్పుడు, ఎలా పుట్టుకొచ్చింది? ఇది డార్విన్ పరిణామ వాదపు సూత్రాలకి బద్ధమై సహజ సిద్ధంగా పుట్టుకొచ్చిందా? లేక, ఎక్కడో, ఎవ్వరో ప్రయోగం చేస్తూ ఉన్న సందర్భంలో ఆ ప్రయోగం పెడదారిని పడి పుట్టుకొచ్చిందా? లేక, ఏ ప్రభుత్వ సంస్థలోనో మారణాయుధాల మీద ప్రయోగాలు చేసే ప్రయోక్తలు ఉద్దేశపూర్వకంగా పుట్టించిన వైరస్ అవధులు దాటి, అదుపు తప్పి, బయట పడిందా? అలా బయటపడడం వల్ల ప్రపంచానికి ఈ పెను "ముప్పెన" వచ్చిన పక్షంలో ఆ ప్రభుత్వం బాధ్యత వహించాలా? ఈ రకం ప్రశ్నలు పుట్టడం సహజం. ఈ ప్రశ్నలకి సమాధానాలు వెతకాలంటే లోతైన శాస్త్రీయ అవగాహన ఉండాలి. అటువంటి అవగాహనని జనరంజక శైలిలో తిరిగి చెప్పడం కష్టమైన పనే. కానీ




ఇటువంటి అవగాహన ప్రజలలో లేకపోతే ఈ రకం మహమ్మారిని ఎదుర్కోవడం తేలిక కాదు.

ఈ వ్యాసానికి ప్రేరణ కారణం డా. కలిశపూడి శ్రీనివాసరావు నాకు పంపిన ఇంగ్లీషు వ్యాసం. జీవసాంకేతిక శాస్త్రం అయన క్రీడా రంగం. ఆయన పంపిన వ్యాసంలోని భావ సంపద, సాంకేతిక పదజాలం అందరికి అర్థం కావు. శాస్త్రీయ పరిశోధన పత్రాలని ఉదహరిస్తూ, బిగుతుగా రాసిన వ్యాసంలోని సారాంశాన్ని వెలికి లాగి తెలుగులో ఈ వ్యాసం రాయడానికి ప్రయత్నిస్తున్నాను.

ఇప్పుడు ప్రపంచాన్ని గడగడా వణికిస్తున్న రోగం పేరు కోవిడ్-19 అనిన్నీ ఈ రోగానికి కారణభూతమైన వైరస్ ని కరోనా వైరస్ అనిన్నీ అనేసి ఉరుకుందాం. ఇంతకంటే లోతుగా వెళితే వ్రతం చెడుతుంది, ఫలం దక్కదు. ఈ వైరస్ మొట్టమొదట చైనాలోని ఉహాన్ నగరంలో ఉద్భవించింది. అక్కడ నుండి ప్రపంచం అంతటా వ్యాపించింది. ఈ విషయంలో భేదాభిప్రాయాలు లేవు. ఇంతకు పూర్వం ఈ భూలోకంలో ఎక్కడా లేని ఈ కొత్త వైరస్ ఉహాన్ నగరంలోకి ఎక్కడనుండి వచ్చింది? ఎలా పుట్టింది? ప్రపంచంలో వైరస్ ల మీద పరిశోధనలు చేసే సంస్థలు 11,000 కి పైబడి ఉన్నాయి. ఈ సంస్థలు ఏటా 200 బిలియను డాలర్లు పైబడి ఖర్చు పెడుతున్నాయి. (ఈ రకం పరిశోధన సంస్థ ఇండియాలో ఏ ఒక్క చోట లేకపోవడం గమనార్హం!) ఇటువంటి సంస్థలలో ఉహాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజి అనే సంస్థ ఉహాన్ నగరంలో ఉంది. ఈ సంస్థలో డా. జెంగ్-లి షి అనే ఆసామి ఒక పరిశోధకురాలు. ఈమె పేరిస్ లో పి.ఎచ్.డి పట్టా పుచ్చుకుని కరోనా జాతి విషాణువుల మీద పరిశోధనలు చేస్తోంది. ఈమె ప్రయోగశాల "బయో సేఫ్టీ లెవెల్ 4" స్థాయికి చెందినది. అంటే ఈ ప్రయోగశాలలోకి వెళ్ళడానికి "నాలుగు కోటగోడలు, నాలుగు కందకాలు" దాటుకుని వెళ్ళాలి.

అంత బందోబస్తుగా ఉన్న ప్రయోగశాల అది. ప్రమాదాలు జరగడానికి వీలు లేని కట్టడి! దీనిని కట్టడానికి పరాసు ప్రభుత్వం సాంకేతిక సహాయం చేసింది. ఈమె చేసే ప్రయోగాలకి అమెరికా ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం అందించింది.

గబ్బిలాలలోఉండే కరోనా జాతి విషాణువులు మనుష్యుల శరీరాలలో చేరి రోగ కారకులు కాగలవని ఈమె 2013 లోనే నిర్ధారించింది. అమెరికాలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అనే సంస్థ డా. జెంగ్-లి షి చేస్తున్న పరిశోధనల వంటి పరిశోధనలు ఇటుపైన చెయ్యకూడదని ఆంక్ష విధించింది. అప్పటికే పశువు బందిలిదొడ్డి దాటి పారిపోయిందనిన్నీ కనుక ఈ ఆంక్ష డా. జెంగ్-లి షి చేసేసిన పరిశోధనల ఫలితాలు ప్రచురించడానికి, మధ్యేమార్గంలోఉన్న పనికి ఆటంకం కలిగించకూడదని జెంగ్-లి షి తో కలసి పనిచేస్తున్న డా. రాల్ఫ్ రీష్ అనే అమెరికా పరిశోధకుడు జెంగ్-లి షి తరఫున వాదించేడు. స్వామి కార్యం కొంత, స్వకార్యం కొంత అన్నట్లు తరువాత వీరిరువురు కలసి వారు చేసిన పనిని ఒక పరిశోధన పత్రంగా ప్రచురించుకున్నారు.

తరువాత 2015 లో ఈ బృందం మరొక పరిశోధన పత్రంలో గబ్బిలాలలో ఉండే కరోనా వైరస్ యటపడి మానవులకి సోకే




ప్రమాదం ఉందని చెబుతూ, “పరీక్ష నాళికలోను, శరీరంలోనూ ఈ వైరస్ పునరోత్పత్తి ఎలా జరుగుతోందో నిరూపించేం. ఈ ప్రయోగాల దృష్ట్యా గబ్బిలాలలో ఉన్న ఈ వైరస్ బయటకి వచ్చి ప్రజలలో ప్రసరించే ప్రమాదం ఉంది.” అని హెచ్చరించారు. పేరిస్ లో పేశ్చర్ ఇన్స్టిట్యూట్ లో పనిచేస్తున్న డా. సైమన్ వేయిన్-హాబ్సన్ ఈ పత్రం మీద వ్యాఖ్యానిస్తూ “ఈ వైరస్ ప్రయోగశాల నుండి బయట పడిందంటే ఇది మానవులకి ఎంత హాని చేస్తుందో అంచనా వేసి చెప్పడం కష్టం” అన్నారు. ఇంత హడావిడి జరిగిన తరువాత ఉహాన్ లోని వైరస్ ప్రయోగశాలలో భద్రత లోపించిందని ఆక్షేపిస్తూ వాషింగ్టన్ పోస్ట్ పత్రికలో 2008 లో ఒక వ్యాసం ప్రచురించేరు. ఈ కథనం అంతా చదువుతూ ఉంటే ఉహాన్ లోని వైరస్ ప్రయోగశాలలో గబ్బిలాలలోఉండే వైరస్ల మీద ప్రయోగాలు జరుగుతున్నట్లు, అక్కడ భద్రత లోపించినట్లు, ఆ వైరస్లు ఆ ఆవరణ దాటి ప్రపంచంలోకి వస్తే అత్యంత ప్రమాదకర పరిస్థితులని ఎదుర్కోవలసి రావచ్చునిన్నీ అటు చైనా ప్రభుత్వం వారికీ తెలుసు, ఇటు అమెరికాలో రాజకీయనాయకులకి, శాస్త్రవేత్తలకి కూడా తెలుసు. అందరూ నిర్లిప్తంగా ఊరుకున్నారు.

ఈ కథ ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా చాలా ఉంది. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే బరితెగించిన విషాణువులు అణ్వాయుధాల కంటే శక్తిమంతమైనవి. అణ్వాయుధాలు ఒక పట్టణాన్నో, ప్రదేశాన్నో భూమట్టం చేస్తాయి కానీ చాపకింద నీరులా ప్రపంచం అంతా పాకిరిపోవు. మన ఆర్థిక వ్యవస్థని కకలావికలం చెయ్యవు. ఇప్పుడు ఒకరినొకరు వేలెత్తి చూపించుకుని ఏమి ప్రయోజనము? తక్షణ కర్తవ్యం ఈ మహమ్మారిని అదుపులో పెట్టడం. టీకా మందులు కనిపెట్టడం. ఆ మందు అందరికి సత్వరం అందుబాటులోకి వచ్చేలా చూడడం. తరువాత ఇటువంటి ప్రయోగాలు ఎవ్వరు చెయ్యకుండా కొన్ని నిబంధనలు అంతర్జాతీయ స్థాయిలో అమలు పరచడం!

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

# ప్రేమంటే ఇంతే



(గత సంచిక తరువాయి)

..."అవును బావా చూస్తున్నారు, మొన్న ఒక సంబంధం వచ్చింది అమెరికాలో డాక్టరట, నన్ను ఒక పెళ్ళిలో చూసాడట, మీ అమ్మాయి చాలా బాగా నచ్చింది, కట్నకానుకలు మాకేమీ వద్దు, కాకపోతే పెళ్ళి మాత్రం ఇక్కడ హైదరాబాదులోనే ఘనంగా చెయ్యాలి అన్నారు"...అని అతని ముఖ కవళికలు గమనిస్తున్నాది. అయితే అనూరాధ ఊహించిన మార్పు ఏదీ అతని ముఖంలో రాలేదు.

"ఇదేమిటి ఈ మానవుడిలో ఏ చలనం లేదు, చిరునవ్వుతో ప్రాశాంతమైన ముఖంతో చెప్పినది వింటున్నాడు, అంటే నేను ఆట పట్టిస్తున్నట్లు అర్ధం అయ్యిందా !" అనుకుంది అనూరాధ.

"ఒహ్! లవ్లీ, అమెరికా సంబంధం అందులో డాక్టరు, దివ్యంగా వుంది. నువ్వు అదృష్టవంతురాలివి నిన్ను నచ్చి పెళ్ళి చేసుకుంటానని వచ్చాడు. 'నువ్వు ఇష్టపడేవాళ్ళ కోసం వేచి చూడడం కన్నా... నిన్ను ఇష్టపడేవాళ్ళ కోసం ఆలోచించడం మిన్న!!!' అన్నారు పెద్దలు. 'ఎప్పుడైనా మనము నచ్చిన వాళ్ళ కంటే, మనని నచ్చిన వాళ్ళని చేసుకోవడం మంచిది', ఇంతకి సంబంధం ఖాయం చేసుకున్నారా?"

"బావా ఇక చాలు, నేను నిన్ను ఆట పట్టిద్దామంటే నువ్వు అమాయకత్వాన్ని నటిస్తూ నన్ను ఏడిపిస్తున్నావు. రెండు సంవత్సరాల క్రితం విశాఖలో నేను నీతో అన్న మాటలు మరచిపోయావా? ఆ రోజే నీకు చెప్పాను నిన్ను ప్రేమిస్తున్నానని, ఈ రోజూ అదే మాట మళ్ళీ చెబుతున్నాను ఐ లవ్ యూ బావా. నా ప్రేమకి నీ అంగీకారం కోసం ఎదురు చూస్తున్నాను... అయితే ఒక విషయం నా పి. జి. పూర్తి కాగానే వివాహం చేద్దామని మా వాళ్ళు అనుకుంటున్నారు, వచ్చే జనవరి ఫిబ్రవరి నుండి సంబంధాలు చూసి, ఖాయం చేసి వైశాఖం లేదా శ్రావణమాసంలో వివాహం చేద్దామనుకుంటున్నారు. అందుకని ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని నువ్వు ఆలోచించు బావా" అని అనూరాధ తన మనసులోని మాటని చెప్పింది.

"సారీ రాధా, పాపం ఇందాకటి నుండి నన్ను ఆట పట్టిద్దామని చాలా కష్ట పడుతున్నావు కానీ నీకు నిరాశ కలిగించాను కదూ! ఇకపోతే విషయానికి వస్తే...నా మాట మన్నించి చదువు మీద దృష్టి పెట్టి డిగ్రీ పూర్తి చేసి పి. జి. లో చేరావు, చాలా సంతోషం. నేనూ అనుకున్నట్లు పి.జి. పూర్తిచేసి ఉద్యోగంలో చేరి మా నాన్నగారిని సపోర్ట్ చేస్తున్నాను. మా తమ్ముడు చంద్రం పి. జి. పూర్తయ్యింది, నిన్ననే నాన్నగారి దగ్గర నుండి ఉత్తరం వచ్చింది, చంద్రం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా సెలక్ట్ అయ్యాడు. సో వాడూ ఉద్యోగంలో చేరతాడు ఇంక బెంగ లేదు, ఇప్పుడు ఇద్దరమూ బాధ్యత తీసుకోవచ్చు. నా లక్ష్యం నెరవేరబోతున్నందుకు సంతోషంగా వుంది, అందుకని ఈ రోజు మనసు విప్పి నీతో మాట్లాడడానికి నిశ్చయించుకున్నాను...రాధా నువ్వు విశాఖలో నీ మనసులోని మాట చెప్పినపుడు, అప్పుడున్న పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని నా అభిప్రాయాన్ని నీకు నిజాయితీగా చెప్పాను. ఎందుకంటే ఆ రోజు నేను కూడా నీ మాటకు సై అని వుంటే మన మనసులు మన చదువుల మీద కాకుండా ఈ ప్రేమ చుట్టూ తిరిగి,

అదే ప్రపంచంలో వుండి మిగతా విషయాలని అశ్రద్ధ చేసే వాళ్ళము, నా లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేసేవాడిని, అందుకే ఆ రోజు కాస్త కటువుగా ప్రవర్తించాను. ఆ రోజు "నీ మాట నాకు శాసనము, శిరోధార్యం బావా" అన్నావు, మనము అలా దృఢ సంకల్పంతో వున్నాము గనుకనే ఈ రోజు మనము ఉన్నత చదువులు చదువుకున్నాము... లావణ్య బాలసారె అయినాకా మనం విశాఖ నుండి కాకినాడ తిరిగి వెళ్ళినాక అవినాశ్‌తో విశాఖ బీచ్‌లో జరిగినది చెప్పాను...

...అతను అంతా విని "నువ్వు సెటిల్ అయ్యాక అనూనే పెళ్ళి చేసుకోవచ్చు కదా?" అన్నాడు. దానికి నేనేమన్నానో తెలుసా? రాధ ప్రేమని కాదనడానికి నా దగ్గర వేరే కారణాలు ఏమీ లేవు అవీ అన్నాను...

...రాధా నీలోని చిలిపితనం నన్ను ఆకట్టుకుంది, నీ చురుకుతనము, స్పోంటినీటి నన్ను ఆకర్షించాయి, నువ్వు నేను కోరుకుంటున్న కోనసీమ అమ్మాయివి, నాకు సంగీతం అంటే చాలా ఇష్టం, అందులో కూడా నీకు ప్రావీణ్యము వుంది, అన్నిటినీ మించి మంచి హృదయముంది...వీటన్నిటి వలన నువ్వంటే నాకు ప్రేమ ఏర్పడింది. నేను కూడా నిన్ను ప్రేమిస్తున్నాను రాధా. ఇన్నాళ్ళు నిన్ను చాలా సస్పెన్స్ లో వుంచాను, ఐ యాం సారీ" అని అనూరాధ పట్ల తన ప్రేమని తెలియపరిచాడు కృష్ణమోహన్.

*******



కృష్ణమోహన్ మాటలు విన్న అనూరాధ సంతోషానికి అవధులు లేవు, హోటల్లో వున్నామన్న సంగతి కూడా మరచిపోయి అతని బుగ్గ మీద ముద్దు పెట్టి..."థాంక్యూ బావా, నాకు చాలా సంతోషముగా వుంది ఇన్నాళ్ళకి నీ మనసులోని మాటని చెప్పావు. ఆ రోజు విశాఖలో నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పిన దగ్గర నుండి ఈ రోజు వరకు ప్రతి రోజూ ఈ తీపి కబురు కోసం ఎదురు చూస్తున్నాను. ఇన్నాళ్ళకి నా పూజలు, నోములు ఫలించాయి, ఆ దేముడు నా మొర ఆలకించాడు. ఈ శుభసమయంలో ఆ వేంకటేశ్వరస్వామిని మళ్ళీ దర్శించుకుని ఆయన దీవెనలు పొందుదాము" అంటూ ఆనందంతో అతని భుజం మీద తల వాల్చి అంది.

కృష్ణమోహన్ చేతి గడియారం చూసి "అలాగే తప్పకుండా స్వామి దర్శనం చేసుకుందాము, తొందరగా పద ఏడున్నర అయ్యింది ఎనిమిదింటికి ఆలయం మూసి వేస్తారు" అన్నాడు. కోవెలలో వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని గుడి ప్రక్కన ఆవరణలో కూర్చుని కాస్సేపు మాట్లాడుకున్నారు. ఆ సమయంలో కృష్ణమోహన్ "రాధా ఇదిగో స్వీట్" అని చాక్లెట్స్ ఇచ్చాడు.

"ఒహ్! థాంక్యూ బావా, ఇంకా దారిలో స్వీట్ తిందామని అడగబోతున్నాను, నువ్వే నాకు ఇష్టమైన చాక్లెట్స్ ఇచ్చావు"

"రాధా టైము ఎనిమిది అవుతున్నాది, ఇంట్లో కంగారు పడతారు పద నిన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేసి నేను రూముకి వెళతాను"

"బావా నువ్వు కూడా ఇంటికి వచ్చెయ్యి, రేపు ఆదివారమే కదా"

"రాధా ఒక సంగతి గుర్తుంచుకో, నువ్వు ఎప్పుడూ ఏ విషయానికీ తొందరపడకూడదు, ఎప్పుడూ ప్రశాంతంగా వుండి నిదానంగా ఆలోచించాలి. ఇందాక నేను నా అభిప్రాయాన్ని చెప్పిన వెంటనే మనము హోటల్లో వున్నామన్న సంగతి కూడా మరచిపోయి నన్ను ముద్దు పెట్టుకున్నావు...నిజమే నేను చెప్పిన విషయం నీకు చాలా ఆనందాన్ని కలిగించింది, కానీ నువ్వు ఉద్రేకానికి లోనయి, మితిమీరిన ఉత్సాహం చూపడం వల్ల నలుగురు దృష్టి మనవైపు పడింది, దాని వల్ల మనకి లాభం మాట ఎలావున్నా నష్టం మాత్రం జరుగుతుంది,

నలుగురూ మనని చులకనగా చూస్తారు. అందుకని మనము ఎప్పుడూ మన సమతౌల్యాన్ని కోల్పోకూడదు...మనమిద్దరం కలిసి ఇప్పుడు మీ ఇంటికి వెళితే అనవసరమైన ఆలోచనలకి తెర లేపిన వాళ్ళమవుతాము. ఉంకొక విషయం మన ప్రేమ గురించి తొందర పడి ఎవరికి చెప్పకు, సమయం వచ్చినపుడు అంటే మీ వాళ్ళు సంబంధాలు వెదుకుదాము అనుకున్నపుడు రవికి చెబుదాము. అతను మన ఈడువాడు గనుక మనలని అర్ధం చేసుకొని, మీ వాళ్ళకు సమర్ధవంతంగా విషయాన్ని వివరిస్తాడు. అంతవరకూ నువ్వు రవికి కూడా విషయం చెప్పకు...ఉంకొక విషయం, పెళ్ళి నిశ్చయము అయినాక ఒక సంవత్సరం తరువాత పెళ్ళి చేసుకుందాము, నిశ్చితార్థానికి పెళ్ళికి మధ్య జీవితం మధురమైనది, అ తీపి గురుతులు మన జీవితమంతా గుర్తుండేవి, అందుకని మనము దాన్ని ఆస్వాదిద్దాము" అని వివరంగా చెప్పాడు కృష్ణమోహన్.

"అలాగే బావా, ఇక మీదట నిన్ను సంప్రదించాకే ఏ విషయంలోనైనా ముందుకు వెళతాను. సారీ బావా ఇందాక ఆనందంలో నన్ను నేను మరచిపోయాను"

అనూరాధని ఇంటి దగ్గరలో దింపి "ఓకే గుడ్‌నైట్, టేక్ కేర్" అని చెప్పి రూముకి తిరిగి వెళ్ళాడు కృష్ణమోహన్.

ఆ తరువాత డి.జి గారు రావడంవలన, ముఖ్యమైన మీటింగుల వలన, కొన్ని రోజులు ఆఫీస్ పని మీద బొంబాయి వెళ్ళడము వలన అనూరాధ ఇంటికి వెళ్ళడానికి వీలు పడలేదు. అందువలన వేంకటేశ్వరస్వామి గుడిలో కలిసిన ఒక మూడు వారల తరువాత కృష్ణమోహన్ ఆమె ఇంటికి వెళ్ళాడు. ఈ మధ్యలో అనూరాధ కృష్ణమోహన్‌తో ఫోన్‌లో మాట్లాడి అతని క్షేమ సమాచారాలు తెలుసుకుని, అతను బిజీగా వుంటున్నాడని తెలుసుకుంది.

"ఏమయ్యా మోహన్ ఎదో ఒక్క సారి కనబడి మరి రాలేదు, మొహమాట పడుతున్నావా రావటానికి?" అని గుమ్మంలో అడుగు పెడుతుండగానే పలకరించారు పార్వతమ్మగారు.

"లేదత్తయ్యా పనిభారము వల్ల కుదర లేదు" అంటూ తను తెచ్చిన అరటి పండ్లని ఆవిడకి ఇచ్చాడు కృష్ణమోహన్.

"నీకు వంట వచ్చా? భోజనము ఎక్కడ తింటున్నావు? వసతి సదుపాయముగా వుందా?" ఇలా ప్రశ్నల వర్షాన్ని కురిపించింది ఆవిడ.

"నాకు వంట రాదు, మా ఇంటి యజమాని నేర్పిస్తాను అంటున్నారు. లకిడికాపూల్ ప్రాంతములో మా ఆఫీసు, ద్వారకా హోటల్‌లో నెలవారి కూపన్స్ తీసుకున్నాను. మధ్యాహ్నము అక్కడ భోజనము చేస్తున్నాను, రాత్రి ఆనంద్‌నగర్ కాలనీలో ఒక భోజనశాల వుంది అక్కడ తింటున్నాను"

"బయట తిండి తింటున్నావు, నీ ఆరోగ్యం జాగ్రత్త, వారాంతాల్లో ఇక్కడికి వచ్చెయ్యి, మాతోపాటు సరదాగా గడపచ్చు, వారానికి ఒక రోజు ఇంటి భోజనము తినవచ్చు మొహమాటపడకు"

ఇంతలో వాణి, సతీశ్ వచ్చి కబుర్లు చెప్పారు, మిగతా వారు ఎవరూ కనబడలేదు. అనూరాధ కోసం అతని కళ్ళు వెదుకుతున్నాయి, మూడు వారాలయిందీ కలుసుకుని ఎప్పుడు కలుద్దామా కబుర్లు చెప్పుకుందామా అని ఆతృతగా వుంది కృష్ణమోహన్‌కి... అయితే ఆమె గురించి అడగటానికి మొహమాటపడి "రవి ఎక్కడ?" అని అడిగాడు.

"రవి అన్నయ్యా ఆఫీసు పని మీద మద్రాసు వెళ్ళాడు, మంగళవారము తిరిగి వస్తాడు, వదిన వాళ్ళ నాన్నగారికి ఆరోగ్యం సరిగా లేదు అందుకని పెద్ద అన్నయ్యా, వదిన రాజోలు వెళ్ళారు. నాన్నగారు పని మీద మా వూరు వెళ్ళారు. అనూ అక్క మేడమీద వుంది" అని మొత్తం అందరి గురించి చెప్పాడు సతీశ్.


"మోహన్ రేపు రాత్రి భోజనము చేసాక నువ్వు వెళుదువు గాని, నువ్వు మేడ మీద అనూతో కబుర్లు చెబుతూ వుండు, టిఫిన్ రడీ అవగానే పిలుస్తాను క్రిందకి వద్దువుగాని... అవును రెండేళ్ళయ్యింది గుర్తు లేదు శనివారము రాత్రి నువ్వు టిఫినే చేస్తావు కదూ?" అన్నారు పార్వతమ్మగారు.

"అవునత్తయ్యా టిఫినే తింటాను" మేడమీదకి వెళ్ళాడు కృష్ణమో

హన్. అక్కడ గదులలో అనూరాధ కనబడలేదు. డాబామీద వుందేమోనని వెళితే అక్కడ అమ్మాయిగారు కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచనలో వుంది.
"హాయ్ రాధ ఎలా వున్నావు" అని పలకరించాడు
అంతవరకు ఒంటరిగా కూర్చుని విసుగు పుట్టిన అనూరాధకి అతని మాటలు విని ఒక్కసారి ఉత్సాహం వచ్చింది. "రా బావా నేను బాగున్నాను, మూడు వారాలయి నిన్ను చూడలేదుగా పిచ్చెక్కినట్లుంది నువ్వు ఎలా వున్నావు? మీ డి.జి విజిట్ అయిందా? బొంబాయి విశేషాలు ఏమిటి?"
"ఫైన్ బాగున్నాను. కొంచెము ఫ్రీ అయింది. ఒహ్! నాలుగు వారాల బట్టి ఊపిరి సలపని పని"
"రాను రాను ఇంకా బిజీ అయిపోతావేమో?"
"అవును ఈ ఉద్యోగము అలాంటిది, కానీ నాకు నచ్చింది. ఇంతకీ ఈ చీకటిలో ఒంటరిగా కూర్చుని ఏం చేస్తున్నావు" అని అంటూ ఒక కుర్చీ లాగి ఆమెకు దగ్గరగా కూర్చోబోయాడు.
"దూరం బావా దూరం రెస్ట్" అంది.
"ఒహ్! మూడు వారాల తరువాత ఇవాళ నిన్ను చూస్తానని, నీతో కబుర్లు చెప్పాలని ఎంతో ఆశతో వచ్చాను, ఇప్పుడు ఆ ఉత్సాహం అంతా నీరుగారిపోయింది" అని నిట్టుర్చాడు కృష్ణమోహన్.
"నిరాశ పడకు బావా, 'పరిస్థితులు మనకి అనుకూలంగా లేవు అని అనుకోకూడదు, పరిస్థితులని మనకి అనుకూలంగా మార్చుకోవాలి'. ఇదీ ఒకందుకు మంచిదే, రేపు స్నానం అందుకని అమ్మ వంట దగ్గరకి రానీయదు, అందుచేత ఇవాళ రాత్రి, రేపు నాకు పని ఏమీ వుండదు, ఈ మూడు వారాలు మిస్ అయిన కబుర్లు చెప్పుకుందాము" అని అతని నిరాశని పోగొట్టే ప్రయత్నం చేసింది అనూరాధ.
"ఓకే, మనకి వున్నదానితో మనము సంతృప్తి చెందాలి"
"అవును...బావా ఈ పౌర్ణమి రోజు ఈ చల్లని వెన్నెల రాత్రి ఇదే రెస్ట్ కాకపోతే నిన్ను చూడగానే పరిగెత్తి వచ్చి నీ కౌగిలో ఒదిగిపోయేదానిని"
"అబ్బో అమ్మాయిగారు మాంచి మూడులో వున్నారే"
"పో బావా నన్ను అంటున్నావుగానీ, ఈ ఆహ్లాదకరమైన రాత్రిని చూసి నీకు మాత్రం అటువంటి అనుభూతి కలగడం లేదా? నిజం చెప్పు"
"అవును ఇలాంటి అనుభూతులు చెప్పనలవికాదు" అని నవ్వుతూ అన్నాడు కృష్ణమోహన్.
"నువ్వు దొంగవి బావా, పైకి ఏమీ మాటలాడవు, నా చేత అన్నీ వాగిస్తావు. సరేగాని ఈ ఆనందకరమైన సమయములో ఒక మంచి పాట పాడు" అని అడిగింది అనూరాధ.
"కురిసే వెన్నెలలో మెరిసే గోదావరిలా" అని అందాలరాముడు సినిమాలో పాట పాడాడు కృష్ణమోహన్. అనురాధ కూడా జత కలిపింది.
"నువ్వు ఒక కీర్తన పాడవచ్చు కదా?" అని అడిగాడు
"ఈ సమయంలో వద్దులే" అంది.
"అవునుకదా మరచిపోయాను, సారీ"
"రాత్రి భోజనాలు అయిన తరువాత నీకు ఇష్టమయిన పాట పాడుతాను"
"సరే అలాగే"
వాణి అనూరాధకి టిఫిన్ తీసుకు వచ్చి ప్లేట్,మంచి నీరు క్రింద పెట్టి "అక్కా నీకు ఏదైనా అవసరమైతే నన్ను కేకెయ్యి, బావా అమ్మ నిన్ను టిఫిన్ తినడానికి పిలిచుకు రమ్మంది" అని చెప్పింది.
"ఇదేమిటి వీళ్ళకి ఇంత చాదస్తము అసలు అనూరాధని క్రిందకి కూడా రానిస్తున్నట్లు లేదు" అని తనలోనే అనుకున్నాడు.
ఫలహారాలు అయిన తరువాత సతీశ్ తనకి లెక్కల్లో కొన్ని సందేహాలని కృష్ణమోహన్‌ని అడిగి నివృత్తి చేసుకున్నాడు. దాని వలన క్రిందకి వచ్చినాక సుమారు గంటన్నరకి పైనే వుండవలసి వచ్చింది. మొత్తానికి అతను మేడ మీదకి వెళ్ళే సరికి రాత్రి పది దాటింది. అంతవరకు ఎదురు చూసి ఎంతకీ కృష్ణమోహన్ రావడం లేదని విసిగి పోయిన అనూరాధ కోపము వచ్చి అలకతో నిద్ర నటిస్తూ పడుకుంది. దగరకు వెళ్ళి "రాధా" అని పిలిచాడు, ఆమె నుంచి సమాధానము రాలేదు కాని ఆమె కను రెప్పలు కదలడం గమనించాడు.
అనూరాధని మాట్లాడించడానికి "నువ్వు నిద్రపోవడంలేదు అని నాకు తెలుసు, నువ్వు లేస్తావా లేదంటే నిన్ను తట్టి లేపుతాను" అని బెదిరించాడు.
(ఇంకా వుంది)

# గడి - నుడి

డా. చాగంటి కృష్ణకుమారి



**సూచనలు :**

**అడ్డం:**

1. పరమాణు సంఖ్య 92 కన్నా ఎక్కువగావున్న ఈ మూలకాలు రేడియో ధార్మికతవల్ల అస్థిరములు (13)
7.నౌకరి చేసే వాడు (3)
8. కొత్త కారు కాదు (4)
10. అందమైన యదు నందనుపై కుంద రదనలిరవొందగ పరిమళ----- (3)
11.రసాయనికులు గంధకాన్ని ఈ ఇంగ్లీషు అక్షరం తో సూచిస్తారు (1)
14.పుస్తకంపేరుకి తన కూతురు పేరు జోడించి పెట్టిన భాస్కరాచార్యుని గణితకృతి (7)
16. మం చి చెడు (6)
18.వరితో పాటూ మొలిచి వరికంటె ఏపుగా పెరుగుతూ పంటకు హానిచేసే 'ఊదర' వంటి మొక్కలు (6)
20. ఇక్కడి వోటరు జాబితాలలో ఎన్ని తప్పులున్నాయంటే అవి అన్నీ..... గా తయారైయ్యాయి ( 7)
24.పొటాషియమ్ ని రసానికులు ఈ ఇంగ్లీషు అక్షరం తో సూచిస్తారు. (1)
26. --- లో పోసినపుడే నీరు తీర్థ మవుతుంది. (3)
28. వీరిరువురి మధ్య ఎంతకగా కక్షలూ --- పెరిగిపోయాయంటె సంధి కుదర్చడం అసాధ్య మనిపిస్తోంది.(4)
29. సీతాలు సింగారం అంటే మాలచ్చిమి ' ఆరం' అని అందామా? (3)
31. పద్దెనిమి నిలువు గళ్లున్నఆధునిక రసాయన మూలకాల పట్టికను ఇలా కూడా అంటాము (13)

నిలువు:

1. ఈ విమాన వాహక ---- పేరు ఐఎన్ఎస్ విక్రమాదిత్య (4)
2. క్రోధాన్నిలోపల దాచుకొని పైకి శాంతంగా కనబడేవారిని --- గప్పిన నిప్పుతో పోలుస్తాము (3)
3. ఒక ద్రావణానికి మరింకెంత ఎక్కువ ద్రావణిని ( ఉదాహరణకి నీరు) కలిపినా దాని గాఢతలో మరింక మార్పు రాని పరిస్థికి చేరుకొంటె ఆద్రావణం ------ దగ్గరకి చేరుకొంది అంటాము.
4. ఇది విరక్తి కి వ్యతిరేకం.(2)
5. వృక్ష శాస్త్రీయ నామం Syzygium aromaticum. వంటకాలలో వాడే సుగంధ ద్రవ్యము .(3)
6.నూనెలు (4) కిందనుండి పైకి.
9. పచ్చి జామ కాయల రుచి (3) కిందనుండి పైకి.
12. వంగదేశం లోవుందొక తెలుగువారికిష్టమైన కూరగాయనిచ్చే మొక్క.(2)
13. పంచమవేదం అయిన భారతంలో పద్దెనిమిది పర్వాలు ఉంటాయి.వాటిని మూడు భాగాలుగా చేయగా మొదటి --- ఆదిపంచకం.
15. కరడుగట్టిన దోషి పోలీసులను ముప్ప--- పెట్టి మూడు చెరువు నీళ్ళు తాగిస్తున్నాడు ( 3)
17.స్త్రీలకు ఈ నాటి సమాజంలో ---- కరువైంది. వారు ఎల్లప్పుడు తమ జాగ్రత్తలో తాముండాలి .(3)
18.Andropogon mariaticum వ్రేళ్లలతో చేసిన పరదాను తడిపి వేసవిలో చల్లదనంకోసం వాడితాము (7) కిందనుండి పైకి.
19. మొర బహువచనం.(3)
21. ఈ వాద్య పరికర తయారీలో చనిపోయిన పశువుల ఎండబెట్టిన చర్మంతో పాటు చెక్కతో నిర్మించిన గుండ్రని చట్రం కూడా ఉపయోగిస్తారు.(2)
22.వంద వేలు బహువచనం (3)
23. పైల్స్(4) కిందనుండి పైకి
25. Aloe vera (4) కిందనుండి పైకి
27. కోరిక (3) కిందనుండి పైకి
29 . దుప్పటి (3) కిందనుండి పైకి
30. పరిమళం(2)

## ఏప్రిల్ నెల గడి-నుడి సమాధానాలు

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| త | ట | స్త్రీ | క | ర | ణ | తు | ల్యాం | క | ము | | గా | ది |
| ల | | | | | | మ్మి | | | | దో | ర | |
| కూ | ప | స్థ | మం | డూ | కం | | వే | గ | ము | | | లు |
| ను | | వ | | | | యి | | | ణ | ఖ | ణ | ఖ |
| రా | | వ్య | యం | | ప | రా | గం | | కో | | | రే |
| స్వ | ర్ధ | | | | | తు | | | ధ | | క | ళ |
| ర | | గం | నా | త్తు | తు | | తు | మ్మ | బం | క | | ర |
| ప | ద్ధు | | గ | | | ప | | | | | ద్ధు | స |
| ల | | | జ | | క | న | కం | | ద | ధి | | ర |
| గా | రా | బ | ము | | | స | | | | ర | | త |
| భా | | | డు | ను | భా | | ము | క | చ | వా | ది | నాం |
| | బూ | ది | | | | క్తి | | | | | | మా |
| గా | జు | | లో | ము | జ | భు | త్రి | హు | బా | ద్వి | మ | స |

# తెలుగు పద్య రత్నాలు - 13

## ఆర్. శర్మ దంతుర్తి



ఈ నెల పద్యం గజేంద్ర మోక్షంలో పోతనది. గజేంద్ర మోక్షం అంటే, “ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపలనుండు లీనమై...” అనేదీ తెలియని తెలుగువాడు ఉండడు సాధారణంగా; ఇది చిన్నప్పుడే పాఠ్యపుస్తకాలలో చదువుకుంటాం కనక. ఈ కథలో కరి మకరిలు రెండూ చాలాకాలం పోరాడుకున్నాక చివరికి ఏనుగుకి పూర్తిగా నీరసం వచ్చేసి ‘పరమేశ్వరా నువ్వు తప్ప ఇంకెవరూ నన్ను రక్షించలేరు, కావవే రక్షింపు భద్రాత్మకా’ అని వేడుకున్నప్పుడు వెంటనే బయల్దేరి వచ్చి తన చక్రంతో మొసలిని చంపుతాడు. ఆ తర్వాత ఈ విజయం వల్ల పాంచజన్యం అనే శంఖం తీసి ఊదుతాడు. ఈ శంఖం ఊదడం విజయాన్ని తెలియజేయడానికి. పాంచజన్యం ఎలా ఊదాడనేది ఈ శార్దూల వృత్తమైన పద్యంలో చెప్తున్నాడు పోతన.


**శా.** **పూరించెన్ హరి పాంచజన్యము కృపాంభోరాశి సౌజన్య**
**ము, న్భూరిధ్వాన చలాచలీకృత మహాభూత ప్రచైతన్యమున్**
**సారోదార సిత ప్రభాచకిత పర్జన్యాది రాజన్యమున**
**దూరీభూత విపన్నదైన్యమునునిర్ధూతద్విషత్సైన్యమున్** (గజేంద్ర మోక్షం – 8.116)

శ్రీహరి పూరించిన పాంచజన్యం ఎటువంటిది? కృపాంభోరాశి సౌజన్యము – దయాసముద్రమంత మంచితనం కలది. ఒక్కోచోట ఈ పద్యంలో “సుధాంభోరాశి సౌజన్యము” అనడం కూడా చూడవచ్చు - పాలకడలిలో పుట్టినది. భూరిధ్వాన – భూరి అంటే అతి పెద్దదైన (లక్ష అంటే 1 తర్వాత 5 సున్నాలు అనుకుంటే, భూరి అంటే 1 తర్వాత 35 సున్నాలు) ధ్వని చేసేది. మహాభూత – పంచ మహాభూతాలని, చలాచలీకృత – చలింపచేయగల, ప్రచైతన్యమున్ – చేయగలిగేది. సార+ఉదార+సిత – గొప్ప సామర్ధ్యంతో తెల్లని, ప్రభాచకిత – కాంతులతో చకితులని చేసేది. ఎవరిని అలా చేసేది? పర్జన్యాది – మేఘాలకి రాజు, ఇంద్రుడులాంటి రాజులని. దూరీభూత విపన్న దైన్యమున్ – దీనుల దైన్యాన్ని దూరం చేసేది, నిర్ధూత ద్విషత్సైన్యమున్ – శత్రువులని పారదోలేది. ఈ పూరించడం ఎందుకని చూస్తే మనకి తెలిసేదేమిటంటే, విజయం వరించాక బాగా నీరసపడిపోయిన తన భక్తుణ్ణి ఉత్సాహపరచడానికి అని అర్థం చేసుకోవచ్చు.

పోతన మరోచోట వామనవతారంలో దానం పూర్తయ్యాక విష్ణువు త్రివిక్రముడిగా విజృంభించడం వర్ణిస్తూ, ఈ శంఖం ఎటువంటిదో చెప్పడానికి “జలధరనినద శంఖ” అంటాడు. జలానికి ఆధారమైనది మేఘం. ఆ మేఘం చేసే నినాదం ఉరుము కనక శంఖం చేసే శబ్దం ఉరుము చేసే శబ్దంలా ఉంటుందని భావం. పంచజనుడనే రాక్షసుడు ఈ శంఖంలో ఉంటూ ప్రజలని ఏడిపిస్తుంటే వాణ్ణి చంపినప్పుడు ఈ శంఖాన్ని విశ్వకర్మ విష్ణువుకి ఇచ్చాడని కథ. ఈ శంఖంలో అనేక రకాలుగా ధ్వని వచ్చేటట్టు ఊదుతారనీ, ఆ ధ్వని బట్టి విన్నవాళ్ళకి ఎందుకలా ఊదుతారో తెలుస్తుందనీ చెప్తారు. మహాభారతంలో కూడా కృష్ణుడు తన రథాన్ని తోలే దారుకుడితో అంటాడు – సైంధవుణ్ణి చంపడానికి ఒక రోజు ముందు – “రేపు మన రథాన్ని గుర్రాలతో సిద్ధంచేసి, నేను పాంచజన్యం

ఊదగానే రంగంలోకి రావాలి. యోధులందరూ మన ప్రతాపం చూడబోతున్నారు." ఏ రకంగా ఈ శంఖం ఊదితే ఏం చేయాలో వీళ్ళకి తెలుస్తుందన్నమాట. మరో విషయం ఏమిటంటే వేదాలు ఈ శంఖంలో దాగి ఉంటాయనీ వాటిని విష్ణువు సర్వవేళలా కాపాడుతూ, కావాల్సినప్పుడు బ్రహ్మదేవుడికి ఇస్తాడనీ మనకి తెలుస్తుంది భాగవతంలో.

ధ్రువుడు చిన్ననాడే పినతల్లి చేత వెక్కిరింపబడి, పట్టుదలతో వెళ్ళి విష్ణువుకోసం తపస్సు చేస్తాడు. చివరకి ఈ తపస్సుకు మెచ్చి విష్ణువు కనిపిస్తే నోటమ్మట మాటరాదు. మనసులో మాత్రం "నేను ఏమీ చదువుకోలేదు, నేర్చుకోలేదు. నిన్ని స్తుతించడానికి నా నోటికి ఏమీ పదాలు కానీ శ్లోకాలు కానీ రావు. నిన్ను కీర్తించాలని ఉంది" అనుకుంటాడు. ఇది తెలిసిన విష్ణువు అప్పుడు తనచేతిలో శంఖాన్ని ధ్రువుడి దవడకి ఆనిస్తే సామవేదంతో ధ్రువుడు విష్ణువుని కీర్తిస్తాడు. అసలు తపస్సు ఎందుకు మొదలుపెట్టాడో మర్చిపోయి, ఏం కావాలో కోరుకో అన్నప్పుడు, "అన్ని మాయావిశేషాలకీ కారణమైన నీ మోము అలా చూస్తూ ఉండడం తప్ప మరే కోరికా లేదు" అంటాడు. గమనించారా, కోరికలన్నీ పోయినప్పుడే భగవద్దర్శనం అయ్యేది. అప్పుడు ఇంకా ఏముంది కోరుకోవడానికి? అదీగాక తన మనసులో కలిగే ప్రతీ ఆలోచనా తెలిసిన భగవంతుణ్ణి ఏమిటి కోరుకునేది? ఇవన్నీ



చిన్నతనంలోనే తెలుసుకున్నాడు కనక అత్యున్నతమైన ధ్రువపదానికి చేరగలిగాడు.

గజేంద్ర మోక్షంలో ఒక చోట "ఇలా కరి, మకరిలు వేల ఏళ్ళు పోరాడుకున్నాక ..." అనే వచనం వస్తుంది. మహా అయితే కరీ మకరీ ఓ మూడు నాలుగు వందల సంవత్సరాలు బతకవచ్చేమో – కలియుగంలో కాకపోయినా ఏ త్రేతా, ద్వాపరయుగాల్లో. మరి వేల ఏళ్ళు ఎలాగయ్యా అంటే, ఈ కరి మనమే. మకరి ఈ సంసారం. ఈ సంసారంలో పడి "నేను" ఏదైనా చేయగలను అనుకుంటూ అందులోంచి బయటకి రావడానికి ప్రయత్నం చేస్తూ విఫలం అవుతూ అలాగే కొట్టుకుంటున్నాం. చాలా వేల ఏళ్ళూ, జీవితాలూ గడిచాక "అబ్బే ఇది కాదు పద్ధతి, వేరే ఏదో ఉంది. 'నేను' కాదు వేరే ఎవరో సహాయం చేస్తే తప్ప ఈ సంసారమనే మకరి నన్ను వదలదు. దీన్ని తప్పించుకోవడానికి ఆ వేరే వాణ్ణి శరణువేడాలి తప్ప మరో మార్గంలేదు" అనే ఆలోచన రావడం మొదలౌతుంది. ఎవరు ఆ వేరేవారు? అప్పుడొచ్చే ఆలోచనే "ఎవ్వనిచే జనించు.... మూలకారణంబెవ్వడనాది మధ్యలయుడెవ్వడు.." అనేది. ఎప్పుడైతే "నేను" కాదు అనే ఆలోచన రావడం మొదలైందో అది మన అహంకారం అంతమవడానికి నాంది. అది అంతమవగానే భగవద్దర్శనం కలుగుతుంది. అప్పుడు మనకి వినిపించే విజయ శంఖారవమే కృపాంభోరాశి సౌజన్యము, సారోదార సిత ప్రభాచకిత పర్జన్యాది రాజన్యము, అన్నీను. మన విజయం ఏమిటంటే భగవంతుణ్ణి దర్శించడం.

పద్యంలో పోతన వాడిన వృత్తం శార్దూలం. శంఖారావం ఉరుము గర్జించినట్టూ, వీరరసంతో ఉండడానికి పోతన సరైన వృత్తమే ఎంచుకున్నాడని తెలుస్తోంది కదా? అసలు ఇటువంటి పద్యాలు "పలికించెడువాడు రామభద్రుడుట" అనే భగవత్కృప లేకపోతే రాయగలగడం అసంభవం.

# తరువు తపన



## ఆదూరి హైమవతి

అనగా నగా ఒక కాకి ఉండేది. అది కడుపునింపుకోను అక్కడక్కడా పడివున్న విత్తనాలూ, చిన్న కాయలూ పండ్లూ, పురుగులూ తింటూ పొట్ట నింపుకుంటూ వుండే
ది. కడుపునిండాక అది విశ్రాంతి తీసుకున్న చోట, అది గోడో, ఇంటికప్పో, మరెక్కడో, అక్కడే ఆహారం అరిగాక రెట్టవేసేది. అలా అది రెట్ట వేసినచోట్ల మొక్కలు మొలిచేవి. కొన్ని మొక్కలు బ్రతికేవి. కొన్ని తగిన ఉష్ణోగ్రత అంటే నేలలో తడి, ఎంద, గాలీ సరిగా అందక చనిపో యేవి. అలాకాకి తిరుగుతూ బ్రతుకుతూ వుండేది.

ఒకమారు చలికాలం అధిక చలితో మానవులేకాక జంతు జాలా లన్నీ ఒణికిపోసాగాయి.అన్నీ రాత్రులు నిద్రించను ,తలదాచు కోను ఏదైనా గుహలు, ఇళ్ళ కిటికీలు, పాడుపడిన ఇంటి వసా రాలు, దేవాలయాల గోపురాలూ అలా వాటికి అనువైనచోట్లు వెతుక్కోసాగాయి. కాకికూడా ఇంత కాలం గూడులేకుండానే సోమరిగా బ్రతికింది. ఇప్పటి వాతావరణ స్థితికి ఎక్కడైనా ఒక గూడు కట్టుకోవాలని నిర్ణయించు కుంది. ఎక్కడ కట్టుకోవాలో ఆలోచించుకుంటూ ఒక చెట్టు మీద వాలింది.

ఆచెట్టు అందికదా " కాకమ్మా! గూడుకట్టుకోను అనువైన ప్రదేశం కోసం చూసుకుంటున్నట్లున్నావా! , నాకొమ్మల మీద కట్టుకో" అంది .

కాకి "ఎందుకు ఓ వృక్షరాజమా! ఎందుకు అలా అడుగుతున్నావు?'
అని అడిగింది.

చెట్టు "కాకమ్మా! నీవు మఱ్ఱి పండుతిని వేసిన రెట్టలోని విత్తనం నుంచీ నేను పుట్టాను. నీవు నాకు మాతృసమానురాలవు. నాకు పుట్టుక నిచ్చిన తల్లిలాం టి దానివి.నాజన్మకు కారణ భూతురాల వు.నేను మొక్కనై చెట్టుగా ఎదగను సూర్యరశ్మి, నీరూ, గాలీ ,నేల అన్నీ చక్కగా అమరాయి. అందుకే నేను ఇలా ఎదిగాను, నీవు వేసిన విత్తు లోంచీ వచ్చిన దాన్ని కనుక నీవు గూడు కట్టుకోను నా కొమ్మల మీద స్థానం ఐవ్వడం నా ధర్మం. నా ఎండు కొమ్మ లు తుంచి గూడుకట్టుకో.లేతకొమ్మలు విరిచి లోపల పక్క పరు చుకో.వాటిమీద నా లేతఆకులు వుంచుకో పడక మెత్తగా వుంటుంది. నేను సంతోషిస్తాను" అంది. దానికా కాకి" నేను సహజంగా రెట్ట వేశానే తప్ప, నీకు జన్మనివ్వాలని కాదు కదా! మరి నీవు ఇంత కృత జ్ఞత చూపుతున్నావే, దానికి నాకు అర్హత వుందా?" అని అడిగింది.

మఱ్ఱిచెట్టు " నీవు సహజంగా వేసినా, నీవు వేసిన రెట్టలో వున్న విత్తనం లోంచే నేను జన్మించాను . దానికి ఋణపడి వుండటం, ఆఋణం తీర్చు కోడం నాధర్మం. అందుకనే నిన్ను నాకొమ్మల్లో గూడుకట్టుకోమనీ అర్థిస్తు న్నాను"అంది.

కాకి అలాగే గూడుకట్టుకుని ఆచెట్టుతో కబుర్లు చెప్తూ కలకాలం జీవిం చింది.

తెలిసి చేసినా తెలీక చేసినా పాపం ఎలా వెంటాడుతుందో , పుణ్యమూ అంతే, తెలీక చేసినా ,కావాలని చేసినా పాపపుణ్యాలు వదలవు. అందుకే పుణ్యమే చేసి తరిద్దాం.

కాకి జీవితకాలం సుమారుగా 70 సంవత్సరాలు.

మఱ్ఱి చెట్టు జీవితకాలం -కొన్ని వందల సంవత్సరాలు.

మానవుడు తన జీవితకాలంలో ఎందరికి సాయంచేశాడు, ఎందరిని సంతోష పెట్టాడు, ఎందరికిఆనందంకలిగించాడు?ఎన్ని మంచి పనులు చేశాడో ఆలోచించుకోవాలి.

# హాస్యానికి రాజు—బసవరాజు



## డా. పోడూరి శ్రీనివాసరావు

బసవరాజు పద్మనాభం అంటే హాస్యం. పద్మనాభం అంటే శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న. పద్మనాభం అంటే పొట్టి ప్లీడరు. ఎన్నో చిత్రాల్లో ప్రముఖమైన హాస్యప్రధానమైన పాత్రలు ధరిస్తూ ఎన్నో విజయవంతమైన చిత్రాల నిర్మాతగా తెలుగు చలనచిత్ర సీమలో ఒక ప్రముఖ స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప హాస్యనటుడు.

బసవరాజు వేంకట పద్మనాభరావు 20 ఆగస్ట్ 1931 న కడప జిల్లా పులివెందుల తాలూకాలోని సింహాద్రిపురం గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు శ్రీ బసవరాజు వెంకటశేషయ్య, శాంతమ్మ. పద్మనాభం తండ్రి వెంకటశేషయ్య కడప జిల్లా వేంపల్లెకు సమీపంలోనున్న వీరన్నగట్టుపల్లె గ్రామానికి కరణంగా వుండేవారు. ఈయన తాత సుబ్బయ్య కూడా కరణమే. పద్మనాభానికి చిన్నప్పటినుంచీ సంగీతమన్నా, పద్యాలన్నా చాలా ఇష్టం. మూడు సంవత్సరాల వయసునుంచీ పద్యాలుపాడే ప్రయత్నం చేస్తూ ఉండేవాడు. ఆవూరి టెంట్ హాల్ లో "ద్రౌపదీవస్త్రాపహరణం", "వందేమాతరం", "సుమంగళి" శోభనావారి "భక్త ప్రహ్లాద"మొదలైన సినిమాలు చూసి వాటిలోని పద్యాలు, పాటలు, హాస్యసన్నివేశాలు అనుకరిస్తుండేవాడు. 1936లో ఐదేళ్ళ వయసులో



"చింతామణి" నాటకంలో కృష్ణుడి వేషం వేసి వన్స్ మోర్లతో బాటు ఒక వెండికప్పును కూడా బహుమతిగా పొందాడు. తర్వాత తమ్ముడు సుదర్శనంతో కలిసి ప్రొద్దుటూరులో వారాలు చేసుకుని, యాయవారంచేసుకుని చదువుకున్నా, చదువు వంటబట్టలేదు. థియేటర్ మేనేజర్ని మంచిచేసుకుని వచ్చిన సినిమాలన్నీ చూసేవాళ్ళు. అప్పుడే సైకిల్ తొక్కడం నేర్చుకున్న పద్మనాభం తమ్ముడితో కలిసి సైకిల్ కొనడానికి డబ్బు సంపాదించడానికి, ఎవరికీ చెప్పకుండా, రైల్లో టికెట్ లేకుండా, ముందు బెంగుళూరు వెళ్లి, అక్కడెంచేయ్యాలో తోచక, మద్రాస్ వెళ్ళారు. అక్కడ నటి

కన్నాంబ ఇంటికివెళ్ళి ఆమెతో విషయమంతా చెప్పారు. తమ గానకళతో ఆమెను మెప్పించి రాజరాజేశ్వరి వారి కంపనీ లో కుదురుకున్నారు..

ఆతర్వాత ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే, ఇంకొకవైపు. ఎస్. ఆర్. లాంటి వాళ్ళతో కలిసి, భక్తతుకారాం లాంటి నాటకాల్లో 50, 60 ప్రదర్శనల్లో పాల్గొన్నాడు. రుషేన్ద్రమని వాళ్ళ ట్రూప్ లో పాదుకాపట్టాభిషేకం, సతీ సక్కుబాయి, హరిశ్చంద్ర, రంగూన్ రౌడీ, శ్రీకృష్ణలీలలు మొదలైన నాటకాల్లో పాల్గొన్నాడు.

వాళ్ళు తీసిన "పాదుకాపట్టాభిషేకం" సినిమాలో కోరస్ లో పాడే అవకాశం వచ్చింది. పద్మనాభం సినిమాల్లో చేరగానే, తమ్ముడు ఇంటికి తిరిగివచ్చేశాడు. తర్వాత పద్మనాభం మాయలోకం సినిమాలో కోరస్ లో పాడడమే గాక, ఒక పాత్ర కూడా వేసాడు. నటుడిగా పద్మనాభానికి ఇది తొలి సినిమా. రెండవ సినిమా త్యాగయ్య. మూడవ సినిమా ముగ్గురుమరాటీలు.. తర్వాత నారదనారది, యోగి వేమన తదితర చిత్రాల్లో అవకాశాలు వరసగావచ్చాయి . 1947 లో వచ్చిన రాధికలో కృష్ణ పాత్ర వేయదమేకాకుండా, ఒక గోపబాలునికి ప్లేబాక్ కూడా పాడాడు. భక్తశిరియాల లో చిన్న చిరుతొండడి పాత్ర. వింధ్యరాణి లో ఇటు నటన, అటు గానం.

1948లో జెమినివారి వీరకుమార్ చిత్రంలో నటించడానికి



కొంత అడ్వాన్సు కూడా తీసుకున్నాడు. ఇంతలో యోగివేమన తీసిన కే. వి. రెడ్డి, గుణసుందరి కథ తీస్తుండడంతో ఆయనను వాహినీ స్టుడియోలో కలవగా, ఆయన పద్మనాభంచేత పాట పాడించుకుని విని, గొంతు బాగాలేదని చిరాకుపడ్డాడు. దాంతో నిరాశగా పద్మనాభం సింహాద్రిపురం వెళ్ళిపోయాడు.

ఆ సమయంలోనే తేలుకాటుతో సోదరుడు ప్రభాకరం, జబ్బుతో చెల్లెలు రాజేశ్వరి మరణించడంతో, విరక్తిచెందిన పద్మనాభం కొన్నాళ్ళపాటు సినిమాలకు దూరంగా వున్నాడు. గుంతకల్ కు సమీపంలోని కొనకండ్ల లో చిన్నాన్న శ్రీనివాసరావుదగ్గర కరణీకం నేర్చుకుంటుండగా, వీరకుమార్ చిత్రం షూటింగ్ కు పిలుపువచ్చింది. ఆ చిత్రం షూటింగ్ జరుగుతున్నరోజుల్లో, విజయా సంస్థతో ఏర్పడిన పరిచయం పద్మనాభం కెరీర్ ను మలుపుతిప్పింది.

షాహుకార్ చిత్రంలో నౌకర్ పోలయ్య వేషానికి ముందు హాస్యనటుడు బాలకృష్ణను అనుకున్నారు. కానీ అతను ముదురుగా అనిపించడంతో చక్రపాణి గారు వేరొక నటుడిని ఆపాత్రకు చూడమని చెప్పగా దర్శకుడు



ఎల్. వి. ప్రసాద్ గారి సూచనతో ఆవేషం పద్మనాభం కు దక్కింది. పాతాళభైరవి స్క్రిప్ట్ వర్క్ జరుగుతుండగా కె. వి. రెడ్డి తోటరాముడిగా రాజారెడ్డిని, మాంత్రికుడిగా ముక్కామలను అనుకున్నారట. కానీ షావుకార్ రషెస్ చూసినవెంటనే మనసు మార్చుకుని హీరోగా ఎన్. టి. ఆర్., మాంత్రికుడిగా ఎస్. వి. ఆర్., అంజిగా బాలకృష్ణ,, సదాజపుడిగా పద్మనాభం లను ఖరార్ చేసుకుని, విజయావారి పర్మనెంట్ ఆర్టిస్ట్ లుగా మూడేళ్ళ అగ్రిమెంట్ తీసుకున్నారు. పాతాళభైరవితో బాలకృష్ణ అసలుపేరు మరుగునపడిపోయి, అంజిగాడు గానే ప్రసిద్ధిపొందాడు. పద్మనాభం తెలుగు, తమిళభాషల్లో పాతాళభైరవితో బాటు విజయావారి తర్వాతి చిత్రాలైన పెళ్ళిచేసిచూడు, చంద్రహారం చిత్రాలలోకూడా నటించాడు. అదేసమయంలో గుబ్బి ప్రొడక్షన్స్ శ్రీ కాళహస్తి మాహాత్యంలో కాశి వేషం వేసాడు. 1954 లో వచ్చిన సతీ అనసూయతో మొదలుపెట్టి, కృష్ణప్రేమ, సతీ సుకన్య, కృష్ణలీలలు, శ్రీరామకథ, సతీ తులసి , ప్రమీలార్జునీయం లలో నారదుడిగా వేసాడు.

1964 వ సంవత్సరంలో రేఖా అండ్ మురళీ ఆర్ట్స్ పేర చలనచిత్ర నిర్మాణసంస్థ ప్రారంభించి దేవత, పొట్టి ప్లీడర్, శ్రీ శ్రీ శ్రీ మర్యాదరామన్న చిత్రాలను నిర్మించారు. మర్యాదరామన్న సినిమాతోనే, నేటి ప్రముఖ గాయకుడు శ్రీ ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం గాయకుడిగా చలనచిత్రసీమకు పరిచయం కావించబడ్డాడు. ఆతర్వాత పద్మనాభం తన బానర్ లో 1968 లో శ్రీరామకథ చిత్రాన్ని నిర్మించడమే కాకుండా, ఆ చిత్రానికి దర్శకునిగా కూడా వ్యవహరించారు. 1970 లో కథానాయిక మొల్ల చిత్రాన్ని నిర్మించి, ఆచిత్రానికి బంగారు నంది అవార్డ్ కూడా పొందారు.



పద్మనాభం నటించిన సినిమాల్లో కొన్ని ప్రముఖమైనవి :: షాహుకారు, పాతాళభైరవి, జయసింహ, పాండురంగమాహాత్యం, అప్పుచేసిపప్పుకూడు, ఇల్లరికం, రాజమకుటం, ఇద్దరు మిత్రులు, భార్యాభర్తలు, వాగ్దానం, వెలుగు నీడలు, ఆత్మబంధువు, కులగోత్రాలు, చదువుకున్న అమ్మాయిలు, డాక్టర్ చక్రవర్తి, దాగుడుమూతలు, బొబ్బిలియుద్ధం, మూగమనసులు, మంచిమనిషి, వీరాభిమన్యు, పాండవవనవాసం, దేవత, సుమంగళి, పొట్టి ప్లీడర్, శ్రీకృష్ణతులాభారం, అవేకళ్ళు, ఆడపడచు, గో పాలుడు భూపాలుడు, పరమానందయ్య శిష్యులకథ, భక్తప్రహ్లాద, శ్రీ శ్రీ శ్రీ మర్యాదరామన్న, తిక్కశంకరయ్య, బాగ్దాద్ గజదొంగ, ఆదర్శకుటుంబం, ఆత్మీయులు, కథానాయకుడు, బుద్ధిమంతుడు, భలేరంగడు, కథానానటించారు.యికమొల్ల, కోడలు దిద్దినకాపురం, చిట్టిచెల్లెలు, జాతకరత్న మిడతంభొట్లు, శ్రీ క్రిష్ణవిజయం,.... ఇలా అనేక సినిమాల్లో ప్రముఖ హాస్యపాత్ర అంటే పద్మనాభానిదే. ఇంకా ఎన్నో విజయవంతమయిన చిత్రాల్లో పద్మనాభం
నటించారు.

చిత్రసీమలో మంచి హాస్యానికి విలువనిచ్చి, మంచి హాస్యనటుడిగాను, ఉత్తమాభిరుచిగల నిర్మాతగా మంచి చిత్రాలను నిర్మించిన శ్రీ పద్మనాభం చెన్నైలో ఫెబ్రవరి 20, 2010 ఉదయం గుండెపోటుతో, 79 ఏళ్ళ వయసులో స్వర్గస్తులయ్యారు.

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



## నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

ఆజానుబాహుడై న వాసయ్యసారు శ్రీరామచంద్రుడిగా, అప్పటికే ఒకసారి నాటకం ఆగిపోయి అవమానపడి ప్రతీకారంతో రగులుతున్న సుబ్బరాయుడు ఆంజనేయుడుగా పాత్రలలో జీవించి, నాటకాన్ని అందరు కలసి రక్తి కట్టించారు.

లక్ష్మణ భరత శత్రుఘ్నులు ఆంజనేయుని చేతిలో హతమై నిర్జీవులుగా పడివుంటే శ్రీరాముడు వచ్చి ఒక్కొక్కరి దగ్గర వారి ప్రతాపాలను పొగిడి విలపించాలి.

"ప్రభయ్యను శత్రుఘ్నుని మేకప్ తో చూస్తూ వుంటే నాకు ముచ్చటేసింది. దుఃఖం రావటం లేదు. అందుకే అలా చాలా సేపు చూస్తూ వుండిపోయా..... అది ప్రేక్షకులను చాలా ఆకట్టుకుంది" అన్నారు వాసయ్య సారు తరువాత ఎప్పుడో...

అలా నాటకపర్వం ముగిసింది. భాకరాపేటలో తరువాత ఎప్పుడో నాటకం వేసినట్టు విన్నా....

## ప్రేమ వివాహం

మనసుకు నచ్చినవారితో జీవితం పంచుకోవటానికి మనిషి పడే ఆరాటం మనిషి మనుగడ మొదలైనప్పటి నుంచి వుంది. తనకిష్టం లేనివాడిని పెళ్లి చేసుకోకుండా ఇష్టమైనవాడిని వెదుక్కుంటూ, ధైర్య సాహసాలు ప్రదర్శించి, చివరికి మెచ్చినవాడి తోనే మెడలో తాళి కట్టించుకుని జీవిత సాఫల్యం పొందడమనేది అనాదిగా వస్తున్న చరిత్ర. ఇలాంటిదే భాకరాపేటలో కూడా జరిగింది.

చిన్నగోపవరం నాగిరెడ్డి ఆజానుబాహుడు, నెమ్మదస్తుడు. ఎద్దుల వ్యాపారంలో అందెవేసిన చేయి. ఈయనకు మగసంతానం లేదు. ఇద్దరు ఆడపిల్లలు. పెద్దక్క, నాగమ్మ. ఇద్దరూ ఆరడుగుల స్త్రీమూర్తులే. ఎర్రటి ఛాయతో.. నుదుట పెద్ద కుంకుమ బొట్టుతో చూడచక్కగా వుంటారు. ఊర్లో ఎక్కువమంది 'నాగిరెడ్డి మామా' అని పిలిచేవారు, కులమతాల సంబంధం లేకుండా.... బహుశా అందమైన ఆడపిల్లలున్న తండ్రులను చాలామంది 'మామా' అనే సంబోధిస్తారనుకుంటా.

నాగిరెడ్డిమామ తన మేనల్లుడు 'ఎంకటయ్య'ను చిన్నప్పటినుంచే పెంచుకున్నాడు. ఆయనకు పెండ్లి చేసి, తన పిల్లలతో ఆయన పిల్లలను కూడా సంరక్షించేవారు. 'ఎంకటయ్య' (ఎంకరెడ్డి) కూడా స్వంత ఇల్లులాగా పనిచేసేవాడు. పెద్దక్కకు పెళ్లి చేసి పెద్దల్లుడిని కూడా 'ఇల్లరికం' తెచ్చుకున్నాడు.

మిగిలింది చిన్నకూతురు



నాగమ్మ. ఈమెకు పెండ్లి చేయాల్సివుంది. ఏదైనా మంచి సంబంధం బయటిది చూసి చెయ్యాలని నిశ్చయించుకుని, మైసూరులో కాంట్రాక్టు చేసి బాగా సంపాదిస్తూవున్న పిల్లవాడితో సంబంధం కుదిర్చారు నాగిరెడ్డిమామ. కట్నం బాగానే ఇవ్వ నిర్ణయించుకున్నట్లుంది. పెండ్లి ముహూర్తాలు నిశ్చయించుకున్నారు.

మేనరికం రెండువైపుల నుంచి వుంటుంది. తండ్రి యొక్క అక్కచెల్లెండ్ర పిల్లలు, తల్లి యొక్క అన్నదమ్ముల పిల్లలు. ఈ రెండు వరుసల్లో తండ్రి వైపు మేనరికం ఇవ్వడానికి తల్లికి ఇష్టం వుండదు. కానీ ఆడపిల్లలు పుట్టినప్పటి నుంచీ మేనత్తలు తమ వంశం, తమ రక్తం... లాంటి సంబంధాలతో తమ వైపు తిప్పుకోవాలని చూస్తారు.

పిల్ల పుట్టినప్పటినుంచి 'అమ్మ' తనవైపు వాళ్ళను పరిచయం చేసి 'అమ్మ' మాట నేర్పిన తరువాత 'మామ' మాటనే నేర్పి తన అన్నదమ్ములకు, వారి పిల్లలలకు దగ్గర చెయ్యాలని చూస్తారు. ఆ విధంగా మేనత్త కొడుక్కే ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది మేనమామ కొడుకు కంటే. కారణం... మేనమామ భార్య ఈ ఇంటి సంబంధమును ఇష్టపడదు కాబట్టి.

ఎంకటయ్య అన్ని ప్రయత్నాలూ విఫలమైన తరువాత చివరి ప్రయత్నంగా తన తమ్ముడికి 'రాక్షస వివాహం' చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. రాత్రికి రాత్రే రెండు లారీల జనంతో ఊరిమీద పడి అమ్మాయిని బలవంతంగా ఎత్తుకెళ్ళి పెండ్లి చెయ్యాలని సంసిద్ధమయ్యాడు.

ఈ విషయాన్ని పెద్దక్కకు ఎవరో ఉప్పందించారు. పెద్దక్క చాలా తెలివైంది. ధైర్యస్తురాలు కూడా. ఆపద సమయంలో ఎలా స్పందించాలో, ఎవరి సహాయం అర్థించాలో, ఎవరిని దూరంగా వుంచాలో తెలిసిన వ్యవహర్త. ఈ విషయాన్ని ఇంట్లో గానీ, ఊర్లో గానీ ఎవరికీ తెలియనివ్వలేదు. కేవలం నాగమ్మకు, నాగిరెడ్డిమామకు చెప్పి రాత్రి పది గంటల సమయంలో సుబ్బారాయుడిని పిలిచి తన పథకం వివరించింది.

సాహసాలు చేయటం, ఊరికి మంచి జరిగే పని ఏదైనా వుంటే ముందుండటం, ఆపదలో వున్నవాళ్ళకు సహకరించటం, తనను నమ్మినవారికి ప్రాణం అడ్డు వేసి కాపాడటం లాంటి మంచి లక్షణాలు సుబ్బారాయుడికి ఉన్నాయి.

పెద్దక్క తన చెల్లెలు నాగమ్మను మగరాయుడిలా అలంకరించింది.

(ఇంకా ఉంది)



## స్వేచ్ఛా కవిత్వపు బావుటా నెగురవేస్తూవున్న వరిష్ఠ కవి, రచయిత,విశ్లేషకులు



# ఆచార్య మాదిరాజు రంగారావు

తుమ్మూరి రాంమోహన్ రావు

సహస్ర చంద్ర దర్శనానంతరం కూడా నిత్యకవిత్వోపాసన చేస్తున్న నిశిత పరిశీలనా శీలి ఆచార్య మాదిరాజు రంగారావు.నిరంతరం మార్పులకు లోనౌతున్న సమకాలీన సమాజాన్ని తన కవిత్వంలో ప్రతీకాత్మకంగా ప్రదర్శిస్తున్న ప్రయోగవాది ఆయన. డా.ముదిగొండ శివప్రసాద్ గారన్నట్లు

**'పౌరాణిక సాహిత్యానికి భరతవాక్యం,**
**ఆధునిక సాహిత్యానికి నాందీ ప్రస్తావన**
**ఈ ఎనుబది ఐదేండ్ల సాహిత్యర్షి'**

ఇటీవల జరిగిన తెలుగు మహాసభలనుద్దేశించి రాసిన పద్యాలు ఆయనకు గల తెలంగాణ మట్టిమీద ప్రేమను చాటుతాయి.

**మా తెలంగాణ ఉద్యమ మాన్య చరిత**
**వివిధభాషల సంస్కృతి విభవ నిలయ**
**నిఖిల జగతికి ఆదరణీయమగుచు**
**ఇంద్ర ధనుసును తలపించు పీఠభూమి**
**హైదరాబాదు సంస్థాన హారరత్న**
**ఈ తెలంగాణ ప్రాకృత స్నేహసీమ**
**ప్రజల స్వాతంత్ర్య కాంక్షతో ప్రభవ రూప**
**రాష్ట్ర భావతరంగిక రాగరమ్య**
**భాగ్య రాష్ట్రమ్ముగా**



**తన అస్తిత్వము రూపుదిద్దుకుని**
**చిత్తంబందు స్వేచ్ఛాశయా**
**నినదంబెంతయు శాంతి తేజమున**
**ఆనీకాంశుత్యాగాలతో**
**కనిపించెన్ ఒక రేణు అందరని**
**ఏకాక్షర చైతన్యమై**
**విన సొంపైనది రామ వచ్చినది భావిన్**

ఆచార్య మాదిరాజు రంగారావు గారు జన్మించింది ఖమ్మం జిల్లా ఎల్లందు మండలంలోని పండితాపురంలో 6 అగస్టు 1935 న.కాకతీయ విశ్వ విద్యాలయంలో తెలుగు సంస్కృత బోధనాచార్యులుగా 1968 నుండి 1995 వరకు పనిచేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి 1962 లో తెలుగు సాహిత్య విద్యార్థిగా ఎం.ఏ చేశారు.1966 లో కవిత్రయ కవిత్వం పై పరిశోధన చేసి పిహెచ్.డి పట్టాపొందారు.1969లో సంస్కృతం లో ఎం.ఏ చేశారు.

వీరి సాహిత్య కృషి బహుముఖీనంగా సాగుతూ వస్తున్నా వీరి ప్రత్యేకత స్వేచ్ఛా కవిత్వం.

కుందుర్తి లాంటి వారు తొలి దశలో వచనకవిత్వానికి నాందిగా నిలిచినా నాటినుంచి నేటి దాకా ప్రతీకాత్మక దీర్ఘ కవితలను వెలువరిస్తూనే ఉన్నారు.మానవీయం, ముక్తధాత్రి-,వియత్నాం,పడగెత్తిన ఉదయం, అమృతలిప్తలు-ఆనందధుని వంటివి అనేకంగా పుస్తకాలు వచ్చాయి.

ఆదర్శం,తాత్త్వికం,ప్రతీకాత్మకం,-భావాత్మకం,మనోవైజ్ఞానికం,సామ-యికం,సామాజిక విషయాలు వీరి కవితా వైవిధ్యాలు.క్రాస్ ఫైర్ లాంటి వచన కవితా కావ్యాలు రచించారు. ముక్తకాలు రాశారు.వీరి వచన కవితా శైలి విలక్షణమైనది.శబ్దం మీద వీరి అధికారం అసామాన్యం. వీరివి కొన్ని కవితా ఖండికలను చూస్తే తెలుస్తుంది.


**'నా శిరస్సు ఆకాశం వలె అందని ఎత్తులో ఉంది**
**నా పాదాలు నదీ తరంగాల వలె ఒకచోట నిల్వ లేకున్నాయి**
**నా మనస్సు గాలివలె వెలుగులన అంతటి ఆడుతుంది**
**నా చూపు పక్షివలె కత్తివలె దిక్కులలో దూసుక పోతుంది'**

-స్వేచ్ఛా కవిత్వం 1

**ఆర్తి నుండి చైత్రం వలె మనస్సు ముక్తమౌతుంది**
**నవ సమాజ శక్తులతో జీవన రుచి పొందుతుంది**

**అవని ఫాలతలం పై శ్రమజీవి భవిష్య రేఖతో**
**పరిణామ చరిత్రలో శాంతి ఖండం మొదలవుతుంది**

-ప్రజాస్వామ్య బింబం (క్రాస్ ఫైర్




నుండి)

ఉదార ప్రజాస్వామ్య నిర్దిష్టమైన కావ్యం క్రాస్ ఫైర్.

స్వేచ్ఛగా కవిత్వమనేది వచన పద్యం,వచన గేయం ,ముక్తచ్ఛందం,వచన గీతం,స్వచ్ఛందకవిత్వం,వచన కవిత్వం మొదలైన వాటి పరిమితుల్ని అంతర్భవించుకున్న విస్తృత రూపం.

డా.మాదిరాజు రంగారావు కవిత్వం ఆధునికయుగంలో అనివార్యంగా కనిపించే నిరంతర పరిణామ శీలంతో పరివర్తన లక్ష్యంతో సాగుతుంది.

వీరు పరిశోధన గ్రంథం "కవిత్రయం సృజనకారుల శిల్పం"

వీరి ఇతర రచనలు స్వేచ్ఛా కవిత్వం,నవలా స్వరూపం,పరిశోధనా స్వరూపం,అధికారభాష,అనువాద కళ, శ్రీ శ్రీ మహా ప్రస్థానం - సమాలోచనం, దాశరథి పునర్నవం-సమాలోచనం,సమదర్శిని,ఆలో-కనం -సాహిత్య వ్యాసాలు,సృజన దృష్టి -మానవీయ భావన,సాహిత్య వ్యాసాలు,సృజన చేతన-కల్ప వృక్షం వంటి అనేక విశ్లేషణాత్మక రచనలు చేసిన వీరి పాండిత్య ప్రకర్ష అసామాన్యమైనది.

అంతేకాదు UGC వారికోసం రాయప్రోలు సుబ్బారావు సంపాదకత్వంలో వెలువడిన మహాభాగవతం,ఖండనాలు లక్ష్మీరంజనం గారి సంపాదకత్వాన వెలువడిన మహాభారత గ్రంథాల సంపాదక వర్గ సభ్యుల్లో ఒకరిగా పనిచేశారు.

UGC వారికోసమే వచనకవిత్వంలో ప్రజాస్వామ్య సిద్ధాంతము ,జాతీయ సమైక్యత అనే ప్రాజెక్టు,స్వాతంత్ర్యానికి వచన కవిత్వంలో జాతీయ, అంతర్జాతీయ,మానవతా ధోరణులు అనే ప్రాజెక్టు కోసం పని చేశారు.

వీరి పలు పరిశోధనాత్మక,-విశ్లేషణాత్మక వ్యాసాలు స్వతంత్ర,-భారతి,నవత,స్రవంతి,జయంతి,-వాఙ్మయి,మూసీ,ఆంధ్రప్రభ,ఆంధ్రభూమి వంటి పలు పత్రికలలో ప్రచురితమయ్యాయి.

1992 ఉత్తమ అధ్యాపక పురస్కారం రాష్ట్ర ప్రభుత్వం నుండి పొందారు. తెలుగు విశ్వవిద్యాలయం నుండి 1993 లో ఉత్తమ ఆధునిక కవిత్వానికి సాహిత్య పురస్కారం పొందారు.1970 లో స్థాపించిన రసధుని సాహితీ పరిషత్తుకు వ్యవస్థాపక లు మరియు సంపాదకులు కూడా.

ఈయన అంతరంగం విశ్వనాథ బహిరంగం శ్రీశ్రీ. స్త్రీవాదం దళిత వాదం, మైనారిటీ వాదం, ఉప ప్రాంతీయవాదం, శ్రామిక వాదం, అంతర్జాతీయ ఉగ్రవాదం- ఇలా సామాజిక పటలంపై ఏ స్పందన వచ్చినా మాదిరాజువారి లేఖిని ఘోషించవలసిందే!! కవిగా మాదిరాజు రంగారావు ఎంతటి లబ్ధప్రతిష్ఠుడో విశ్లేషకునిగా అంతటి అంతర్ముఖుడు.

# స్వయంవరం



## ఎలెక్ట్రాన్

ఆదివారం సాయంత్రం ఆరుగంటలకి అత్తమామలు గుళ్ళో పురాణశ్రవణానికి వెళ్లినప్పుడు, బయటకు వెళ్లబోతున్న కూతురు చారుకేశిని కుర్చీలో కుదేసి, ఆందోళి అడిగింది. "ఏమే, చారూ! పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువు పూర్తయింది. చచ్చిచెడి అత్తిసరు మార్కులతో గట్టెక్కి డిగ్రీ తీసుకొన్నావ్! నీ పెళ్లి చూసి పోదామని నీ నాయనమ్మా, తాతయ్యా కళ్ళలో వత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. నీ అభిప్రాయం తెలుసుకోమని మీ నాన్నగారు ప్రతిరోజూ నన్ను నస పెట్టేస్తున్నారు! చెప్పు, పెళ్లికి సిద్ధమేనా?"

"అమ్మా! నా పెళ్లికోసం ఇంతగా ఆందోళన పడిపోతున్నావ్, నానమ్మా తాతయ్యలను త్వరగా పంపేద్దామనేనా?" చారుకేశి ఓ విసురు విసిరింది.

"నేనన్నది సాధారణంగా ముసలివాళ్లనే మాట. పెళ్ళికి తొందరచేసే పదజాలం. విపరీతార్ధాలు తియ్యక. ఇలా అడిగిందొకట్టైతే, సమాధానం మరొకటి రాసే మూడో తరగతిలో ప్యాసయ్యావు. ఇరవై రెండేళ్లు వచ్చేశాయ్! వయసు ముదిరిన కొద్దీ సంబంధాలు రావడం కష్టమైపోతుంది. నీ ముగ్గురు మేనత్తలకీ నీకు ఈడూ జోడూగా ఉండే కుమార రత్నాలున్నారు. నీ మేనత్తలు మీ నాన్నగారినీ, ఆయన నన్నూ ఒత్తిడి చేసేస్తున్నారు. ఆలస్యం చేసినకొద్దీ దారితప్పే అవకాశం ఉంటుందని పక్కింటి పేరమ్మ రోజుకోమారు అన్యాపదేశంగా అంటోంది! నాచేత మరిన్ని మాటలు అనిపించుకోకుండా తిన్నగా సమాధానం చెప్పు," అంది ఆందోళి.

"అమ్మా! ఆందోళి రాగంలోని సంగతులన్నీ పలికేశావు. ఇక ఈ చారుకేశి గానం విను. నీకు నీ ఆడపడుచులతో వియ్యమొందడానికిష్టం లేదు. ప్రస్తుతం బావామరదళ్ల ప్రేమాయణాలకి సినిమాల్లో కాలం చెల్లిపోయింది. రాణి పల్లవి, రాజా చరణ్ ల ప్రేమగాథలే నడుస్తున్నాయి. మేనరికాలు మంచివి కావని వైద్యరంగం ఘోషిస్తోంది. ఈ నా ఘోష అత్తలకి నాన్నద్వారా వినిపించు. లేకపోతే నేనే ఆ ముగ్గురు బావ గాళ్ళకీ ఉత్తరం రాసేస్తాను. నువ్వు పేరమ్మ మాటలకి విలువనిస్తున్నావూ అంటే, నా మీద నమ్మకం లేనట్టే! ఇది నీ రాగంలో ఒక అపశృతి! ఇకపోతే, తల్లిదండ్రులు తమ సంతానం వయసులోకాని, ఉద్యోగంలోకాని అడుగుపెట్టడంతోనే సంబంధాలు వెతికేయాలి కానీ 'పెళ్లిచేసుకొంటావా?సంబంధాలు చూడమంటావా?' అని అడగకూడదు. కోరికలు కోరికేస్తున్నా సమాధానం చెప్పడం మొహమాటంగా ఉంటుంది. అడక్కుండానే చూడ్డం మొదలు పెట్టారనుకో, అప్పుడు పిల్లలు ఇప్పుడప్పుడేకాదు-ఇంకా చదువుకోవాలి-ఉద్యోగంలో స్థిరపడాలి-మరి నేనెవర్నో ప్రేమించానులాంటి చరణాలు పలుకుతారు. అలా కాకుండా మౌనంగా ఉండిపోతే పెళ్ళికి సిద్ధమేనని అనుకోవాలి. తెలిసిందా?"

"తెలిసిందిలే! నువ్వు ఉదహరించిన చరణాలతోనే పరోక్షంగా సమాధానం చెప్పావు. చాలా సంతోషం చారూ! నాన్నగారితో పేరమ్మగారి మొగుడు పేరయ్యగారితో మాట్లాడమని చెబ్తాను. సరేనా?"

చారుకేశి తలఊపింది.

"మనల్ని గురించి మనకంటే ఆయనకే ఎక్కువగా తెలుసు. తక్కువల్ని ఎక్కువలుగా చేసి చెప్పే నేర్పుకూడా ఆయనలో పుష్కలంగా ఉంది!" అంది ఆందోళి.

"నేను మొదటి తరగతిలో ఏం.ఏ. పాసయ్యానని ఆయన చెప్తే, కుటుంబ సాంప్రదాయంలో ఫుల్

స్టాపంత చుక్క పెద్ద మచ్చగా మారి పోతుంది. అందుచేత మన్నిగురించి ప్రగల్భాలు చెప్పొద్దని చెప్పండి!"అంది చారుకేశి.

"అయ్యో! నువ్వు ఫస్ట్ క్లాసులో పాసయ్యావని పేరమ్మగారికి ఇదివరకే చెప్పేశానే! ఎలాగా?"

" సంబంధాలు రానీ, నా డిగ్రీ సంగతి నేను చూసుకొంటాను! మీ బాధ్యత సంబంధాలు చూడ్డం వరకే! అవునూ, కాదనే నిర్ణయం మట్టుకు నాదే! ఈ సంగతి నాన్నతో చెప్పు. నేను నడకా, ఓనమాలూ ఆలశ్యంగా మొదలు పెట్టానని నాన్నగారు బళ్ళో చేర్పించినప్పుడు నా వయసు ఓ ఏడాది తక్కువ రాశారు. పేరయ్యగారు నేను పుట్టినప్పుడు నా జాతకచక్రం వేశారనీ, అది అద్భుతమని ఆయనన్నారని నాయనమ్మ నా వీపు ఆప్యాయంగా నిమురుతూ ఎన్నోసార్లంది. ఇప్పుడు నా డి.ఓ.బి. అంటే డేటాఫ్ బర్త్ కి అంటే పుట్టినరోజుకి అనుగుణంగా జాతకచక్రం వేయించండి. లేకపోతే పేరయ్యగారు కొంప ముంచేస్తారు!"

"నాన్నగారు రిజిస్టర్ చేయించిన పుట్టిన తేదీతో ఈ మధ్యనే ఇంకో ఆయనచేత జాతక చక్రం వేయించారు. ఆ తేదీకి నీది ఆశ్లేష నక్షత్రమౌతుందని, నీజాతకంలో కుజదోషం ఉందనీ, కట్టుకున్నవాడికి సుఖ శాంతులుండవనీ రాశాడు. నీకు ఓనామాలు సరైన సమయంలో దిద్దడం రాలేదని, తీరి కూర్చుని మీ నాన్నగారు ఈ వెధవపని చేశారు. నీ పుట్టిన తేదీ నీ మేనత్తలకి తెలుసు కాబట్టి గొడవ ఉండకపోవచ్చు కానీ, వచ్చే పై సంబంధాలవారికి జాతకాలమీద నమ్మకముంటే ఇంతే సంగతులు. నీకిప్పుడు బావలే గతి! నా ఖర్మ!"

"ఆ సంగతి నా కొదిలేయ్, నేను చూసుకొంటాను. పెళ్లికొడుకుల తల్లిదండ్రులు కూడా కోటి అబద్ధాలడతారు! అవసరమొస్తే వాళ్లనీ ఓ కుదుపు కుదుపుదాం."

ఆందోళి ఆ రోజు రాత్రి భర్త మోహన్రావుకి చారుకేశి పెళ్ళికి సిద్ధమేనని చెప్పి, పుట్టినరోజు మార్చడం వల్ల వచ్చే ఇబందుల్ని గురించి కూతురు లేవనెత్తిన అనుమానాల సంగతి వివరించింది.

"ఇప్పట్నుంచీ ఆ విషయమై బుర్ర బద్దలు కొట్టుకోక! వంతెన ఎలా దాటాలో తర్వాత ఆలోచిద్దాం." మోహన్రావు భార్యకి నచ్చచెప్పాడు.

తర్వాత మోహన్రావు తన తల్లిదండ్రులకి వాళ్ళ మనవరాలు పచ్చజండా ఊపిందని చెప్పాడు.

"నీ అప్పలకి ఏం సమాధానం చెప్పేదిరా? వాళ్ళు నామీద కక్ష కట్టేస్తారు! ఇదంతా నీ పెళ్ళాం చేస్తున్న పని!" అని తల్లి వాపోయింది.

"ఎవరేం అన్నా, చారూ తన మనసులో ఉన్న మాట చెప్పేసింది. చారూ వాళ్ల కూతురు. వానప్రస్థంలో ఉన్న మనం వేలుపెట్టి కెలక్కూడదు. పై సంబంధం చూడ్డమే మంచిది," అని మోహన్రావు తండ్రి ధన్సర్ రావు భార్య కల్యాణిని ఓదార్చాడు.

పిట్టగోడమీదుగా కబురందుకొన్న పేరమ్మ భర్త పేరయ్యకి చెప్పింది. ఆయన మోహన్రావు ఇంట్లో వాలాడు.

"పేరయ్యగారూ! ఒక్కొక్కళ్లూ వచ్చి, చూసి, జాతకం బావోలేదు, కట్నమింత కావాలి, కట్నం వద్దు కానీ వైభవంగా పెళ్లి చెయ్యాలి, ఉద్యోగం చెయ్యాలి, చేయకూడదు లాంటి లొల్లాయి కబుర్లు చెప్పి, కాదనడానికి కారణాలు చేప్తే నాకు నచ్చదు. అందుకని జాతకాలు బావున్నాయని, ఉద్యోగాలు స్థిరంగాఉన్నాయని, రెడీమేడ్ దుస్తులకు సరిపోతారని, నాకు ఈడూ జోడుగా ఉంటారని తలిస్తే నిర్ధారించుకొని, పెళ్లిచూపులకు ముహూర్తం పెట్టి, ఓ పదిమందిని ఒక్కసారే స్వయంవరానికి తీసుకురండి." అంది చారుకేశి.

"నీ జాతకాని కేమమ్మా?! ఊఁ అంటే ఇరవై సంబంధాలు దొరుకుతాయి. నా దగ్గర ప్రస్తుతానికి పాతిక సంబంధాలున్నాయి. వాళ్ళలో కనీసం పదిమందికి జాతకాలు తప్పక కలుస్తాయి. వచ్చేనెల మొదటి శనివారం సాయంత్రం నాలుగ్గంటలకి దివ్యమైన ముహూర్తం ఉంది. ఏర్పాట్లు చెయ్యమని మీ నాన్నగారితో చెబ్తాను, సరేనా?"

ఆ వచ్చేనెల మొదటి శుక్రవారం రానే వచ్చింది. మోహన్రావు డాబామీద షామియానా వేసి, కుర్చీలు తెప్పించి, ఏర్పా-

ట్లు చేశాడు. శుక్రవారం వస్తే మర్నాటి శనివారం రాకుండా ఉంటుందా? ఆ శనివారం కూడా ఘడియ తప్పకుండా వచ్చింది. సాయంత్రం అయ్యింది. పెళ్లికొడుకులు ఓ పదిమంది కార్లలో, ఆటోల్లో, తమ తమ తల్లిదండ్రులతో వచ్చారు. కొంత మంది కాబోయే అర్థమొగుళ్లు అంటే అడపడుచులు కూడా వచ్చారు. మరికొంతమంది వరుల దగ్గరి బంధువులు, స్నేహితులు వచ్చారు. అందరూ కలిసి అరవైమంది దాటారు.

పేరయ్య అందర్నీ పేరుపేరునా మోహన్రావు దంపతులకి పరిచయం చేశాడు. పెళ్లికొడుకులందరూ దర్జాగా ముందు వరస కుర్చీల్లో కూర్చున్నారు. మోహన్రావూ, ఆయన ఇద్దరు కొడుకులూ బోన్ చైనా పళ్లేలలో పచ్చిమిరపకాయ బజ్జీ, సమోసా, ఆత్రేయపురం పూతరేకు, కాకినాడ కోటయ్య కాజా ఫలహారంగా పెట్టారు. శీతల పానీయాలందించారు. మూతులు తుడుచుకోడానికి అభినందల్ని ముద్రించిన మంచి చేతి రుమాళ్లని అందరికీ అందించారు.

చారుకేశి ఉప్పాడ నూలు చీరకట్టుకొని మైక్ ముందర నిల్చుని అందరికీ నమస్కారం చేసి తాతయ్యనీ, నాయనమ్మనీ, తల్లిదండ్రుల్నీ, ఒక అన్నయ్యనీ, ఒక తమ్ముణ్ణి పరిచయం చేసింది. "ఇతను మా అన్నయ్య. పేరు గుజ్జర్. ఎమ్మే బియిడీ చేసి, ఇరవైవేలుకి సంతకం చేసి పదివేలు జీతం తీసుకొని ఓ ప్రైవేటు స్కూల్లో పనిచేస్తున్నాడు. నా పెళ్లయితేకాని తను పెళ్లి చేసుకోనంటున్నాడు! వీడు నా తమ్ముడు. పేరు మల్హార్. ఇంటర్ చదువుతున్నాడు. వీణ్ణి కదిపితే ఇప్పట్నుంచే అత్తారింటికి దారేది అని అడుగుతాడు. సరే! ఇక నాగురించి చెబ్తాను. నాకు కొంచెం ఆలస్యంగా, నడకా, మాటలూ వచ్చాయట. అందుకని నాన్నగారు నన్ను స్కూల్లో చేర్పించినప్పుడు ఒక ఏడాది తక్కువ వేసి చేర్పించారు. కానీ మా పేరయ్యగారు నేను పుట్టిన రోజు జాతకమే మీకందరికీ చూపించారని ప్రమాణం చేసి చెబ్తున్నాను. దానికి సాక్ష్యంగా నా జనన ధృవపత్రం జిరాక్స్ కాపీ నా తమ్ముడు మీకు పంచుతాడు. ఇక పోతే మా పేరయ్యగారు నేను ఎమ్మే పాసయ్యానని చెప్పేఉంటారు. కానీ నేనా డిగ్రీని మొదటి ప్రయత్నంలోనే అత్తెసరు మార్కులతో సాధించాను. నా వయసు విషయంలోనూ, విద్యార్హత స్థాయి విషయంలోనూ మీకభ్యంతరాలేమైనా ఉంటే నిర్మొహమాటంగా చేతులెత్తండి."

ఎవరూ చేతులెత్తలేదు సరి కదా, "మాకేమీ అభ్యంతరం లేదు!" అన్నారందరూ ఒకేసారి. ఇది చారుకేశి అందానికి మొదటి సూచిక.

"మీ తల్లిదండ్రులు నా జాతకాన్ని మీ, మీ సిద్ధాంతులకు చూపించే ఉంటారు. మా పేరయ్యగారు మీ జాతకాల్ని పరిశీలించే ఉంటారు. అందుకని జాతకాలు కుదరలేదన్న కారణాన్ని చెప్పడానికి మీకూ, మాకూ కూడా అవకాశం లేదు కాబట్టి, ఆ విషయాన్ని ఇక మరిచిపోదాం, సరేనా?"

"ఓ, ఆలాగే" అన్నారందరూ. ఇది ఆమె సౌందర్యానికి రెండో సూచిక.

"మా నాన్నగారు మండలాఫీసులో ప్రస్తుత పదవిలో సీనియర్ గుమాస్తా. నా చిన్నప్పట్నుంచీ నా పెళ్లికని ప్రత్యేకించి కొద్దికొద్దిగా సొమ్ము పొదుపు చేస్తూ రెండు లక్షలు పోగు చేశారు. ఏ రూపంలోనైనా అంతకు మించి ఖర్చు చేయలేరు. నేను చెయ్యనివ్వను. ఏమంటారు?"

"మాకు కట్న కానుకలమీద ఆశలేదు. మీరెంత ఒబ్బిడిగా చేసినా మాకు సమ్మతమే!" తల్లిదండ్రులు కోలాహలంగా చెప్పారు. అబ్బాయి బండ బాబులా ఉన్నా కాబోయే కోడలు అందంగా ఉండాలన్న ఆశ తల్లిదండ్రులది.

"అయితే నేను మీకు నచ్చినట్లేనా?"

"ఆ సంగతి వేరే చెప్పాలా?"

"ఒరేయ్! మల్హార్! వీళ్లలో నీకు నచ్చిందెవరో చెప్పరా?" చారుకేశి తమ్ముణ్ణి అడిగింది.

"అక్కా! వరులందరూ దర్జాగా కనిపిస్తున్నారు. స్త్రీ ఆకర్షణ మగ

సుగంధాలని చల్లుకొని (మేల్లీ పెర్ఫ్యూమ్ లని స్ప్రే చేసుకొని) వచ్చి ఘుమ ఘుమ లాడిపోతున్నారు. అందరూ బి.టెక్కు లేనట. పేరయ్యగారు చెప్పారు. నీది అత్తెసరు ఎమ్మే కాబట్టి వీళ్ళని 'ఇంజనీరింగ్లో ప్రవేశించింది మెరిట్ మీదనా లేక డొనేషన్ కట్టా?' అని అడిగే హక్కు నీకు లేదు. వీళ్ళందరూ సాఫ్ట్ వేర్ కంపెనీల్లో హైదరబాద్ లో, బెంగళూరులో, చెన్నైలో, పుణెలో, ఢిల్లీలో పన్జేస్తున్నవారే! కానైతే కొన్ని ప్రత్యేకతల్ని చెప్పాలి గదా? ఈయనది దీపిక పడుకొనే భర్త రణవీర్ సింగ్ గెడ్డం. ఈయనది హాలీవుడ్ నటుడు బెన్ ఎఫ్లిక్ గెడ్డం. మరేమో ఈయనది మధురంగా పాడుతా ప్రోగ్రాంలో పాడే గానకుమార్ గెడ్డం. ఈయనది క్రికెట్ సామ్రాట్ విరాట్ కోహ్లీ గెడ్డం. ఈయన గెడ్డం హాలీవుడ్ నటుడు జార్జ్ క్లూనీది. ఈయన గెడ్డం ప్రఖ్యాత టీవీ యాంకర్ సుదీప్ ది. మరి ఈయనది కరీనా కపూర్ భర్త సైఫ్ అలీఖాన్ గెడ్డం. ఈయన గెడ్డం హింది చలన చిత్ర సామ్రాట్ షారూఖ్ ఖాన్ ది. ఈయనది నాలుగువందల ఎపిసోడ్లగా నడుస్తున్న 'మైదా చపాతీ' టీవీ ధారావాహిక నాయకుడు ఓర్మికుమార్ మూడు మెట్ల గెడ్డం. ఈయనది హింది సినిమా నటుడు శాహిద్ కపూర్ గెడ్డం. ఆఖరుగా ఈయనది మరో ప్రఖ్యాత హాలీవుడ్ నటుడు జిరార్డ్ బట్లర్ గెడ్డం. అటుపైన నీ యిష్టం!" అన్నాడు.

అందరూ చప్పట్లు కొట్టారు. చారుకేశి ఎవర్ని వరిస్తుందో అన్న ఉత్కంఠ నెలకొంది. ఎందుకంటే చారుకేశి చాలా రూపవతి. అందుకనే ఎమ్మే డిగ్రీ స్థాయి పర్వాలేదన్నారు. నిరాడంబరంగా పెళ్లిచేస్తామన్నా ఒప్పుకొన్నారు.

"ఒరే, తంబీ! నీ లౌకికజ్ఞానం అపారం. కానైతే ఇబ్బంది ఏమిటంటే, నువ్వు టీవీల్లో వస్తున్నపాతకాలం సినిమాలు చూడవు. నాకు పాత సినిమాలే నచ్చుతాయి. దేవానంద్, శశికపూర్, షమ్మీకపూర్ లాంటివారు నున్నటి బుగ్గలతో చక్కగా కనిపిస్తారు. సునిల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్ లాంటి క్రికెట్ వీరులంటే నాకు చాలా అభిమానం. నున్నటి గెడ్డాలతో మెరిసి పోయే టాం క్రూజ్ లాంటి హాలీవుడ్ నటులంటే అభిమానం. అంతెందుకు? శ్రీరాముణ్ణి, శ్రీకృష్ణుణ్ణి ఏ ఫోటోలో కానీ, ఏ సినిమాలో కానీ, రామాయణ మహాభారత టీవీ ధారావాహికల్లో కానీ గెడ్డంతో చూపించారా? అరుణ్ గొవిల్, నితీశ్ భారధ్వజ్, ఎన్ టి రామారావు, శోభన్ బాబు లాంటి నటులు ఎంతటి కనువిందుగా ఉండేవారో మీలో ఎవరికైనా తెలుసా? నాకు గెడ్డం బుచ్చిబాబులంటే అంతగా ఆకర్షణ లేదు. అందుకని వీరు తమ గెడ్డాల్నితీయించుకొని రేపు మళ్ళా వస్తే నా నిర్ణయాన్ని తెలుపుతాను మరి!" అంది చారుకేశి.

"అమ్మ బాబోయ్! ఎంతో కష్టపడి, ఖర్చుతో కూడిన ఈ డిజైనర్ గెడ్డాల్నిపోషిస్తున్నాం. వాటిని తీసేయడం మా వల్ల కాదు!" అంటూ ముందు వరసల్లో కూర్చున్నఆ వర యువకులందరూ ఒక్కసారిగా లేచి కిందకి పరుగులు తీశారు.

పాపం మోహన్రావు, పేరయ్యలు గెడ్డాలు పెంచని వరులకోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. పదేళ్ళ కుర్ర వెధవకూడా, ఎప్పుడు మీసం మొలుస్తుందా, ఎప్పుడు గెడ్డం వస్తుందా అని ఎదురుచూసే ఆధునిక కాలప్రభావం!

***

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**ఆధారాలు : 1) మ = అసలు అక్షరం 'గ'**

**పాచేలి డబ్బ గొబ్బ రేహేలి పూవు బొగ్గ**
**బొగ్గ బొగ్గ రివమకూహె రేదాలిమా**
**శబ బాషాది కంమావు బాషదు**
**ఖోంటేషాది గీనిద్దబాషదు**

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

వలపుతో పెనవేయు పారిజాతమునై
ఎదమీద నిదురించు అడియాశ లేదు
గడ్డిలో విరబూయు కన్నె కుసుమమునై
నీ చరణకమలాల నలిగి పోనీవా

ఏప్రిల్ నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు:

- శ్రీ పాటిబళ్ల శేషగిరిరావు
- Ms అనూరాధసాయి జొన్నలగడ్డ
- Ms కిరణ్మయి గోళ్ళమూడి
- Ms స్వర్ణకుమారి
- Ms సరస్వతి పొన్నాడ
- Ms పొన్నాడ సరస్వతి
- శ్రీ తల్లాప్రగడ మధుసూదనరావు
- శ్రీ కె. మురళీమోహన్



Let
America
Work Again!!

RNI No. TELTEL/2011/39497 MAY 2020 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st May Date of Posting: 8th May




Published, Edited and P[illegible] by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.